జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 21, ఆగస్టు 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




## సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో గొప్ప అవకాశాలు

- నూతన ఇంధన పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి, మహానాడు:

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన ఇంధన పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ సమీక్షలో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 పై రివ్యూ చేశారు. కొత్త పాలసీపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నాయని ...వాటిని సద్వినియోగం చేసుకుంటే దేశంలోనే సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి ఏపీ అతిపెద్ద కేంద్రం అవుతుందని చంద్రబాబు అన్నారు.

రెన్యూవబుల్ ఎనర్జీలో 2014- 2019 మధ్య కాలంలో దేశంలోనే టాప్ లో ఉన్న ఏపీ.. 2019 తరవాత వచ్చిన ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలోకి వెళ్లిపోయిందని అన్నారు. రాష్ట్రంలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ, బయో ఎనర్జీకి ఉన్న అన్ని అవకాశాలను మిగతా.. 2లో

# టీడీపీనా.. అయితే ఏంటిట?

“ ఐదేళ్లలో జగనేయులు తమ్ముళ్ల వ్యాపారాలు దెబ్బతీశారు. బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. సరే ఇప్పుడు సదరు తముళ్లు మళ్లీ వ్యాపారాలు ప్రారంభించారు. కానీ విచిత్రంగా సొంత పార్టీ ఎమ్మెల్యేనే తమ్ముళ్లను పిలిచి ‘మీ మీద కంప్లైంట్లు వస్తున్నాయి. మా సంగతేంటి తమ్ముడూ’ అని బేరాలకు దిగుతున్నారు. ‘అదేంటి? మేము పుట్టు టీడీపీ వాళ్లం కదా’ అని తమ్ముళ్లు అమాయకంగా బదులిస్తే.. ‘టీడీపీ అయితే ఏంటిట’ అని సదరు ఎమ్మెల్యే, పేకాట పేకాటే తమ్ముడు తమ్ముడేనని నిర్మొహమాటంగా చెబుతుంటే తమ్ముళ్లు ఖంగుతింటున్నారు. ఇది ఒక రాజధాని జిల్లా కేంద్రంలోనే కాదు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే సీన్లు.

- తమ్ముళ్లను దెబ్బేస్తున్న ఎమ్మెల్యేలు
- నిర్మొహమాటంగా తమ్ముళ్ల వద్దే వసూలు
- ఎన్నికల్లో పార్టీ కోసం లక్షలు ఖర్చు పెట్టుకున్న తమ్ముళ్లు
- జగన్ జమానాలో లెక్కలేనన్ని కేసులు
- అభ్యర్థులను కాకుండా పార్టీని చూసి గెలిపించిన పార్టీ అభిమానం
- తీరా గెలిచాక సొంత పార్టీ నాయకులకే టెండర్లు పెడుతున్న ఎమ్మెల్యేలు
- తమ్ముళ్ల వ్యాపారాలు మూసివేయించి బేరాలకు దిగుతున్న వైచిత్రి
- విధిలేక ఎంతో కొంత చదివించుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- అగ్రనేతలంతా బిజీనే.. ఎవరూ దొరకని దుస్థితి
- ఎవరికి చెప్పాలో తెలియని అయోమయం
- ‘నిఘా’ నిద్రపోతోందంటున్న టీడీపీ నేతలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

అది రాష్ట్ర రాజధాని కొలువై ఉన్న జిల్లా. దాని ప్రధాన కేంద్రంలో రెండు నియోజకవర్గాలుంటాయి. రెండు నియోజకవర్గాల్లోనూ ఉన్నది టీడీపీ ఎమ్మెల్యేలే. పార్టీ అంటే చెవికోసుకుని, ప్రాణం పెట్టే కమ్మ వర్గమే అక్కడ అధికం. గత ఐదేళ్లలో పార్టీపై పిచ్చి అభిమానంతో తమ్ముళ్లు లక్షలు, కోట్లు ఖర్చు చేశారు. ఒక్కముక్కలో చెప్పాలంటే.. టీడీపీకి మహారాజ పోషకులు వాళ్లే. కానీ ఎమ్మెల్యేలు మాత్రం కమ్మేతరులు. అదృష్టం కలసి వచ్చి, అనుకోకుండా ఎమ్మెల్యేలయిన వాళ్లే.

ఐదేళ్లలో జగనేయులు తమ్ముళ్ల వ్యాపారాలు దెబ్బ తీశారు. బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. సరే ఇప్పుడు సదరు తమ్ముళ్లు మళ్లీ వ్యాపారాలు ప్రారంభించారు. కానీ విచిత్రంగా సొంత పార్టీ ఎమ్మెల్యేనే తమ్ముళ్లను



పిలిచి ‘మీ మీద కంప్లైంట్లు వస్తున్నాయి. మా సంగతేంటి తమ్ముడూ?’ అని బేరాలకు దిగుతున్నారు. ‘అదేంటి? మేము పుట్టు టీడీపీవాళ్లం కదా’ అని తమ్ముళ్లు అమాయకంగా బదులిస్తే.. ‘టీడీపీ అయితే ఏంటిట’ అని సదరు ఎమ్మెల్యే, పేకాట పేకాటే తమ్ముడు తమ్ముడేనని నిర్మొహమాటంగా చెబుతుంటే తమ్ముళ్లు ఖంగుతింటున్నారు. ఇది ఒక రాజధాని జిల్లా కేంద్రంలోనే కాదు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే సీన్లు.

అయితే.. ఈ సమస్యలన్నీ కొత్తగా పార్టీ ఎమ్మెల్యేలైన నియోజకవర్గాల్లోనే ఉన్నాయన్నది తమ్ముళ్ల వేదన. మరి ఈ విషయం ఎవరికి చెప్పాలి? పెద్దసార్లంతా బిజీ. ఎవరికీ టైమ్ ఇవ్వరు. ఇక మా గోడు వినేదెవరు? దీనికోసమేనా లక్షలు తగలేసుకుని, కేసులు పెట్టించుకుని పార్టీని గెలిపించుకుంది? రాష్ట్ర విభజన తర్వాత అధికారంలో వచ్చినప్పుడూ ఇంతే ఉంది. పాము తన గుడ్లను తానే తిన్నట్లు.. మా పార్టీ ఎమ్మెల్యేలే మా నుంచి వసూళ్లు చేస్తున్నారు. ఇవన్నీ ఎవరికి చెప్పాలి? ఎలా చెప్పాలి?.. ఇదీ తెలుగుతమ్ముళ్ల గోస.

అధికారంలో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు విపక్షాలకు చెందిన నేతలను బెదిరించడం చూస్తుంటాం. కానీ అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలే సొంత పార్టీ నేతలను బెదిరించి వ్యాపారాల్లో వాటాలు అడుగుతున్న వైచిత్రి ఇది. గుంటూరు జిల్లా కేంద్రంలో కొత్తగా, ఎన్నికైన ఓ ఎమ్మెల్యే అల్లుడుగారి దెబ్బకు తమ్ముళ్లు హడలిపోతున్నారట.

సొంత పార్టీ నేతలకు చెందిన క్లబ్బు, బార్లు, రియల్ ఎస్టేట్, క్రషర్ వ్యాపారాలను మూయించి, మిగిలిన వారికి హెచ్చరిక సంకేతం ఇస్తున్నారట. చివరకు సెలూన్లపై జీవనం సాగించేవార ఇల్లు కడుతున్నా విడిచిపెట్టడం లేదన్నది తమ్ముళ్ల ఫిర్యాదు. ‘మీ మీద చాలా ఫిర్యాదు లొస్తున్నాయి. మరేంటి సంగతి’ అని బేరాలు మొదలు పెడుతున్నారట. చివరకు అంతకాదు. ఇంత తీసుకోండి అని గతిలేక డబ్బులు చదివించుకుంటున్నామని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


‘ఐదేళ్లు పార్టీకి ఖర్చు పెట్టి, మళ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం లక్షలు ఖర్చుపెడితే మాకు ఇచ్చిన బహుమతి ఇదా’ అన్నది తమ్ముళ్ల ఆవేదన. మేం పార్టీ వాళ్లమే. మీ కోసం పనిచేశాం కదా అని గుర్తు చేస్తే, దేని దారిదానిదే అంటున్న వైచిత్రి. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలున్న దాదాపు అన్ని మిగతా.. 2లో

## ఏపీలో భారీగా విస్తరణకు హెచ్‌సీఎల్ సన్నాహాలు!

- మరో 15 వేల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- మంత్రి లోకేష్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

అమరావతి, మహానాడు:

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్ సీఎల్ ఆంధ్రప్రదేశ్ లో భారీగా తమ కార్యకలాపాల విస్తరణకు సిద్ధమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్ సీఎల్ 4,500 మందికి



ఉద్యోగాలు కల్పించింది. తాజాగా రాష్ట్రంలో భారీఎత్తున విస్తరణ చేపట్టాలని నిర్ణయించినట్టు ఆ సంస్థ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ వెల్లడించారు. హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ తో సమావేశమయ్యారు. ఏపీలో విస్తరణ ద్వారా మరో 5,500 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా మిగతా.. 2లో

మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ పోరాట ఉద్యమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, రాజకీయ సలహాదారు టీడీ జనార్ధన్ అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ





తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి మరోసారి సెక్రటేరియట్ ఆవరణను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పార్టీ నేతలతో కలిసి ఘన నివాళి అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## సెక్రటేరియట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు

హైదరాబాద్, మహానాడు:

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సెక్రటేరియట్ ఆవరణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. డిసెంబర్ 9న సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి తెలంగాణ అధికార పీఠమైన సెక్రటేరియట్ సముచితమైన స్థానమని, అక్కడ తెలంగాణ తల్లిని సగర్వంగా, సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలలో మరోసారి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు అంశాన్ని మిగతా.. 2లో

## పోలీసులకు తెలియకుండా ఆస్పత్రిపై గుంపు దాడి చేసిందా?

- సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ,మహానాడు:

అంత ఘోరం జరిగితే.. ఆత్మహత్య అని ఎలా చెప్పారంటూ కోల్ కతా ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోల్‌కతా మిగతా.. 2లో







03

ఫోర్జరీ!



03

‘వెలుగొండ’ పనుల్లో నాణ్యత లేదు



04

టీడీపీలో చేరిన వైసీపీ వారిని అందలం ఎక్కిస్తున్నారు



05

వైసీపీ పాలనలో చింపిన విస్తరిలా ఆర్థిక వ్యవస్థ!


## మంకీ పాక్స్... కేంద్రం అప్రమత్తం!

- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

న్యూఢిల్లీ,మహానాడు:

ప్రపంచ దేశాలను భయాందోళనకు గురిచేస్తున్న మంకీ పాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. దద్దుర్లు ఉన్న రోగులను గుర్తించి, వారికి వైద్యం అందిచడానికి ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేయాలని అధికారులకు ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అలాగే ఢిల్లీలో మూడు నోడల్ ఆస్పత్రులను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. విమానాశ్రయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే అనుమానితులకు ఆర్టీ-పీసీఆర్ వ్యాధి నిర్ధరణ పరీక్ష చేయాలని మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఆఫ్రికాలో ఈ ఏడాది 18 వేలకుపైగా మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయి. పొరుగుదేశం





పాకిస్తాన్‌లోనూ మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయి. ఈ కేసుల్లో మరణాల రేటు 1 నుంచి 10 శాతం వరకు ఉంది. మిగతా.. 2లో

## భారీ వర్షాలు... కలెక్టర్లు అప్రమత్తం కండి

- విద్యా సంస్థలకు సెలవులపై మీదే నిర్ణయం
- 10 రోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి
- 23, 24 తేదీల్లో నూతన ‘రెవెన్యూ’ ముసాయిదాపై వర్క్ షాప్‌లు
- ఎల్ఆర్ఎస్ పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్
- భారీ వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మహానాడు:

రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి




పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదురుకోవడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 21, ఆగస్టు 2024

# ఏపీలో భారీగా విస్తరణకు హెచ్‌సీఎల్ సన్నాహాలు!

(మొదటిపేజీ తరువాయి..)

పెట్టుకున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫేజ్ 2లో భాగంగా నూతన కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టి మరో పది వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఐటిలో ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్, స్కిల్ డెవెలప్మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విస్తరణకు కావాల్సిన కొన్ని అనుమతులు, గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలు విడుదల చేయాల్సిందిగా హెచ్ సీఎల్ ప్రతినిధులు మంత్రిని కోరారు.

### విడతల వారీగా రాయితీలు

మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ... గత టీడీపీ హయాంలో అనేక రాష్ట్రాలు పోటీపడగా, తాను స్వయంగా వెళ్లి హెచ్ సీఎల్ చైర్ పర్సన్ శివ్ నాడార్ తో మాట్లాడి గన్నవరంలో క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పించానని చెప్పారు. రికార్డు టైంలో అనుమతులు, భూ కేటాయింపులు చేసి, యుద్ధ ప్రాతిపదికన కార్యకలాపాలు ప్రారంభించేలా చేయడం తనకు మంచి అనుభూతినిచ్చిందని అన్నారు. గన్నవరం వైపు వెళ్లిన ప్రతిసారీ యువతకు 4,500 మందికి ఉద్యోగాలు కల్పించామన్న సంతృప్తి, సంతోషం కలిగేవని చెప్పారు.

అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ అసమర్ధత కారణంగా సంస్థ కార్యకలాపాలు ముందుకు సాగలేదు. 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సిన సంస్థ కేవలం 4500 మంది వద్దనే ఆగిపోయింది. పూర్తి స్థాయి అనుమతులు, రాయితీలు ఇవ్వకుండా నిలిపివేసి ఇబ్బందులు పెట్టారు.

ఇప్పుడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది... అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం. మీ కంపెనీ పూర్తి సామర్ధ్యంతో కార్యకలాపాల విస్తరణకు సంపూర్ణ సహకారం అందిస్తాం. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన క్లియర్ చేస్తాం. గత ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన రాయితీలను విడతల వారీగా చెల్లిస్తాం. మరో 15,500 మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా మీరు పనిచేయండి. అందుకు అవసరమైన పూర్తి సహకారం మేం అందిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఐటిలో వస్తున్న అధునాతన మార్పులకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నందుకు హెచ్ సీఎల్ సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు.

# టీడీపీనా.. అయితే ఏంటిట?

(మొదటిపేజీ తరువాయి..)

నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి.

పార్టీ ఐదేళ్ల విపక్షంలో ఉన్న సమయంలో, అంతకుముందు పదవులు అనుభవించిన నేతలంతా.. జగన్ సర్కారు పెట్టే కేసులకు తాళలేక హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు చెక్కేసి, అప్పుడప్పుడు నియోజకర్గాల్లో కనిపించేవారు. పార్టీ ఆఫీసుపై దాడి జరగకముందు వరకూ, వారెవరూ భూతద్దం పెట్టి వెతికినా కనిపించలేదు. ఆ క్లిష్ట సమయంలో పార్టీని మోసింది ద్వితీయ స్థాయి నేతలే. కేసులు, వేధింపులకు గురయి, వ్యాపారాలు కూడా వదలుకున్నది కూడా వారే. ఇటీవలి ఎన్నికల్లో స్థానికంగా చందాలు వేసుకుని మరీ పనిచేసింది కూడా వారే.

అలాంటి తమ్ముళ్ల త్యాగాలకు, అధికారం వచ్చిన తర్వాత కూడా విలువలేకపోవడం వారిని అసంతృప్తికి గురిచేస్తోంది. పార్టీలో కొత్తగా ఎమ్మెల్యేలయిన వారే తమను వేధించడం, తమ వ్యాపారాలకు అడ్డంకులు కల్పించడాన్ని తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. విభజన తర్వాత జరిగిన ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా, దాదాపు ఇదే పరిస్థితి ఉండేదని గుర్తుచేస్తున్నారు.

అప్పుడు సీనియర్ ఎమ్మెల్యేలు తమను వేధిస్తే, ఇప్పుడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు వేధిస్తున్నారని తమ్ముళ్లు వాపోతున్నారు. ఎన్నికల్లో చేసిన ఖర్చు రాబట్టుకోవాలన్న తొందరలో, చివరకు సొంత పార్టీ వారిని కూడా విడిచిపెట్టకపోవడమే వారిని వేదనకు గురిచేస్తోంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎక్కడినుంచో వచ్చినా గెలిపించినా, వారికి ఆ విశ్వాసం లేకుండా తమ వ్యాపారాల్లోనే వాటాలు అడుగుతున్నారని, ఇది తాము ఊహించని పరిణామమంటున్నారు.

'అప్పుడు విభజనకు ముందు పదేళ్లు, ఇప్పుడు ఐదేళ్లు విపక్షంలో ఉండి ఆకలితో ఉన్న ఎమ్మెల్యేలు నష్టపోయిన సంపాదనను ఒకేసారి త్వరగా సంపాదించుకోవాలన్న ఆత్రుతతో, చివరకు సొంత పార్టీ నేతలనూ విడిచిపెట్టడం లేదు. ఇది పార్టీ భవిష్యత్తుకే నష్టం. అయినా ఇవన్నీ సేకరించి, సమాచారం ప్రభుత్వానికి ఇవ్వాల్సిన ఇంటలిజన్స్ ఏం చేస్తుందో అర్ధం కావడం లేద'ని తమ్ముళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సొంత పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, గతంలో వైసీపీ నేతల బెదిరింపులతో ఆపేసిన పాత వ్యాపారాలను, టీడీపీ నేతలు గ్రూపుగా ఏర్పడి మళ్లీ ప్రారంభించారు. అయితే అందులో కొత్త ఎమ్మెల్యేలు-వారి బంధువులు వచ్చి తమను వాటాలు అడుగుతున్నారని, మీపై ఫిర్యాదులొస్తున్నాయని బెదిరిస్తుంటే ఏం చేయాలో.. ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి ఉందంటున్నారు. గ్రామ స్థాయిలో చేసుకునే వ్యాపారాల్లో కూడా, ఎమ్మెల్యేలు వాటాలు అడగటం దారుణమంటున్నారు.

ఇదిలాఉండగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు రాష్ట్ర స్థాయి కూటమి ప్రముఖులు.. జిల్లా నేతల వ్యాపారాల్లో వాటాలు అడుగుతున్నారన్న చర్చ కూటమిలో బహిరంగంగానే జరుగుతోంది. పేకాట క్లబ్బుల్లో తనకూ వాటా కావాలని తాజాగా రాజానగరం ప్రముఖుడు కూడా డిమాండ్ చేస్తున్నారని పార్టీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. పేకాట క్లబ్బులకు వచ్చే జూదరులంతా తమ నియోజకవర్గం నుంచి వస్తున్న వారే కాబట్టి, తనకూ వాటా కావాలన్నది రాజానగరం ప్రముఖుడి వాదనట. ఈ ఇద్దరు ప్రముఖులకు కొత్తగా టికెట్లు వచ్చి గెలిచిన నేపథ్యంలో, టీడీపీ నేతల వ్యాపారాల్లో వాటాలకు ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక విశాఖ జిల్లాలో సెజ్ పరిధి ఉన్న రెండు నియోజకవర్గాల జనసేన ప్రముఖులు.. గత ఎన్నికల్లో టీడీపీకి ఆర్ధికంగా దన్నుగా నిలిచిన పారిశ్రామికవేత్తలను వేధిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. సెజ్ నుంచి బయటకు వచ్చే ప్రతి లారీ నుంచి, వారు వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు టీడీపీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో సెజ్‌లోని పారిశ్రామికవేత్తల నుంచి, పార్టీకి అన్ని రకాల మద్దతు కూటగట్టేందుకు టీడీపీ నేతలు చాలా కష్టపడ్డారట. అయితే తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత, వారి వ్యాపారాలకే జనసేన ప్రముఖులు అడ్డంకులు సృష్టించడంతో.. వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తమ్ముళ్లు తలపట్టుకుంటున్నారట.

ఇక కొత్తగా పార్టీలోకొచ్చి ఎమ్మెల్యేలయిన వారు.. గతంలో తాము వచ్చిన పార్టీ నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఫిర్యాదులు లేకపోలేదు. వారి ముందు తాము శీలపరీక్ష నిరూపించుకోవలసి వస్తోందని వాపోతున్నారు. ఇక టీడీపీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో అయితే, తాము వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉందంటున్నారు.

ఈ పరిస్థితులను నాయకత్వం దృష్టికి తీసుకువెళదామంటే, ఎవరూ అపాయింట్మెంట్లు ఇవ్వడం లేదని తమ్ముళ్లు వాపోతున్నారు. అధినేత చంద్రబాబునాయుడు-యువనేత లోకేష్ ఇద్దరూ బిజీ అయిపోయినందున, వారిని కలవడం కష్టమవుతోందంటున్నారు. ఇక పార్టీ ఆఫీసులో ఎవరిని కలిసి చెప్పాలో, వారితో తమ ఎమ్మెల్యేలకు ఎలాంటి సంబంధాలున్నాయో అర్ధం కావడం లేదంటున్నారు.

గతంలో చంద్రబాబునాయుడు దృష్టికి ఇలాంటి అంశాలు తీసుకువెళ్లే అవకాశం ఉండేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం మారిన అపాయింట్మెంట్ వ్యవస్థ గందరగోళంగా ఉందంటున్నారు. సొంత పార్టీ నేతలనే వేధిస్తున్న ఎమ్మెల్యేలను నియంత్రించకపోతే, అది భవిష్యత్తులో వేరే పరిణామాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

# విజయవాడలో ఘనంగా చేనేత ఫ్యాషన్ షో

**జాతీయ చేనేత ప్రదర్శన వేదికగా కేక పుట్టించిన ర్యాంప్ వాక్**

**నగర వాసుల నుండి మునుపెన్నడూ చూడని ఆదరణ: సవిత**

**చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం కార్యాచరణ: సునీత**

**విశిష్టమైన చేనేత కళపై ప్రజల్లో చైతన్యం: రేఖారాణి**




**విజయవాడ,మహానాడు:** జాతీయ చేనేత ప్రదర్శన వేదికగా విజయవాడలో నిర్వహించిన హ్యాండ్లూమ్స్ ఫ్యాషన్ షో ఆహూతులను ఆకర్షించింది. విభిన్న రాష్ట్రాలకు చెందిన నూతన చేనేత వస్త్ర శ్రేణితో పడతులు చేసిన ర్యాంప్ వాక్ అదరహో అనిపించింది. చేనేత సంస్కృతి సంప్రదాయాలతో విజయవాడ మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయ చేనేత ప్రదర్శన నగర వాసుల విశేష ఆదరణను పొందింది. ముగింపు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం చేనేత జౌళి శాఖ నిర్వహించిన ఫ్యాషన్ షో ఆహుతులకు కనువిందు చేసింది. సరికొత్త డిజైన్లతో రూపొందించిన సాంప్రదాయ చేనేత వస్త్రాలతో ప్రదర్శనలో అడుగులు వేసిన ముద్దుగుమ్మలు ఆహా అనిపించారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన చీరాల ,ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి ఇలా ఒకటా రెండా వందలాది డిజైన్లతో ప్రత్యేకించి యువతను ఆకర్షించే విధంగా రూపుదిద్దిన చేనేత వస్త్రాల ఫ్యాషన్ షో కేక పుట్టించింది. దేశంలోని విభిన్న రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్రాలను ఫ్యాషన్ షో ద్వారా ప్రదర్శింపచేసారు. ఫలితంగా చేనేత వస్త్రాలను నేటి యువతీయువకులు చేరువ చేసే క్రమంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. మోడల్స్ తో పాటు చేనేత వస్త్రాలను అమితంగా ఇష్టపడే యువతులు సైతం స్వచ్ఛంధంగా ర్యాంప్ వాక్‌లో పాల్గొనటం విశేషం. చేనేత వస్త్రాలంటే వయోజనులకే అన్న నానుడికి ముగింపు పలుకుతూ వేదికపై పడతుల నడక సాగింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. జి.పద్మజా రెడ్డి కూచిపూడి నృత్యప్రదర్శన సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ ఈ ప్రదర్శన నగర వాసుల నుండి మునుపెన్నడూ చూడని ఆదరణను చూరగొంటుందన్నారు. దాదాపు రూ. 2 కోట్ల విలువైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారన్నారు. చేనేత వస్త్రాలు అందంతో పాటు హుందాతనాన్ని ఇస్తాయని, ఆరోగ్యపరంగాను, పర్యా వరణ పరంగాను ఎంతో అనుకూలమైనవన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేత రంగం పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారి ఆర్ధికాభివృద్ధి కోసం కార్యాచరణ అమలు చేయనుందన్నారు. రాష్ట్రంలో చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. గత కొన్నేళ్లలో నేతన్నలకు సరైన ఆదాయం లేక, వారి ఉత్పత్తులు కొనేవారు లేక వలసపోయే పరిస్థితి వచ్చిందని, ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చూసామన్నారు. నేతన్నలను ప్రోత్సహించే క్రమంలో ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఈ సందర్భంగా మంత్రి సవిత పిలుపునిచ్చారు.

చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు ఆలోచనల మేరకు చేనేత కళను ప్రోత్సహిస్తూ ఈ రంగాన్ని స్వయం సమృద్ధి బాటలో నడిపించటానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర చేనేత వస్త్ర శ్రేణికి ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు లభించే విధంగా కాలానుగుణ ఫ్యాషన్లకు అనుగుణంగా నూతన వెరైటీలను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. విశిష్టమైన చేనేత కళపై ప్రజల్లో చైతన్యం తెచ్చే క్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ కమీషనర్ రేఖారాణి అన్నారు. ఆప్కో ఎండీ ఆర్.పవనమూర్తి మాట్లాడుతూ ఆప్కో నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రదర్శనలను ఏర్పాటు చేయటం ద్వారా విక్రయాలను ప్రోత్సహిస్తున్నామని, రాయితీ ధరలకే అమ్మకాలు చేస్తేన్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త సంచాలకులు కన్నబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సెక్రటేరియట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి..)

ప్రస్తావించారు. ఇందులో భాగంగానే ఆవరణను మంగళవారం సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు స్థలం, ఏరియా డిజైన్ ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని సూచించారు. పూర్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# పోలీసులకు తెలియకుండా ఆస్పత్రిపై గుంపు దాడి చేసిందా?

(మొదటిపేజీ తరువాయి..)

ట్రైనీ డాక్టర్ హత్యా చార, హత్య కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరి పింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృ త్వంలోని ధర్మాసనం ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసింది. 'ఈ ఘటన అత్యంత భయా నకం. నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్టు తెలిసింది. కానీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాత్రం దీన్ని ఆత్మహత్య కేసుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. రాత్రి 8.30 గంటలకు మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన మూడు గంటల తర్వాత రాత్రి 11.30 గంటలకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది?. ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటివరకు ఏం చేస్తున్నారు? మృతురాలి తల్లిదండ్రులను మూడు గంటల పాటు ఎందుకు వేచి చూసేలా చేశారు? ఆస్పత్రిలో అంతమంది ధ్వంసం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు. పోలీసులకు తెలియకుండా ఓ గుంపు ఆస్పత్రిపై దాడి చేసిందా? దుండుగుల గుంపు ఎలా దాడులకు పాల్పడింది? దుండగును కట్టడి చేయడంలో బెంగాల్ ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది' అని సుప్రీం ప్రశ్నల వర్షం కురిపించింది.

# మంకీ పాక్స్... కేంద్రం అప్రమత్తం!

(మొదటిపేజీ తరువాయి..)

### లక్షణాలు ఇవే!

డబ్ల్యూహెచ్ఓ ప్రకారం, మంకీపాక్స్? వైరస్ మనిషి శరీరం లోపలికి ప్రవేశించిన తర్వాత 1 నుంచి 21 రోజుల్లో ఎప్పుడైనా లక్షణాలు బయటపడవచ్చు. పొక్కులు, జ్వరం, గొంతు ఎండిపోవడం, తల, కండరాల నొప్పులు, వెన్ను నొప్పి, నిస్సత్తువ వంటివి సాధారణంగా కనిపిస్తాయి. ఇవి దాదాపు 2 నుంచి 4 వారాలపాటు కొనసాగవచ్చు. ఇది ఆ వ్యక్తి ఇమ్యూనిటీ పవర్?పై ఆధారపడి ఉంటుంది. కొంతమందికి నోరు, కళ్లు, గొంతు, ప్రైవేట్ భాగాలపై పొక్కులు రావొచ్చు.

### ఎలా నివారించుకోవాలంటే?

మంకీపాక్స్ లాగా కనిపించే దద్దుర్లు ఉన్న వ్యక్తుల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. మంకీపాక్స్? వైరస్ సోకిన జంతువు లేదా వ్యక్తితో సంబంధం ఉన్న బట్టలు, దుప్పట్లు లేదా ఇతర వస్తువులను తాకకుండా చూసుకోవాలి. అదేవిధంగా ఎప్పటికప్పుడు సబ్బు నీటితో చేతులను శుభ్రంగా వాష్ చేసుకుంటూ ఉండాలి. ఒకవేళ చేతులు కడుక్కోవడానికి ఆల్కహాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్‌ని యూజ్ చేయాలి. చివరగా దీని బారిన పడకుండా ఉండాలంటే ఈ వ్యాధి లక్షణాలను తెలుసుకొని, అప్రమత్తంగా ఉండాలి.

# భారీ వర్షాలు... కలెక్టర్లు అప్రమత్తం కండి

(మొదటిపేజీ తరువాయి..)

ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు.

గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి మంత్రి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కలెక్టర్లు ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజ ధానికిఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని మంత్రి అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకురాబోతున్న నూతన రెవెన్యూ చట్టం- 2024 పై ప్రజల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ జరపాలని ఇందులో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ధరణి సమస్యలపై గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులతో పాటు ఇటీవల కాలంలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను వచ్చే పదిరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దరఖాస్తుల పెండింగ్ అధికంగా ఉందని ఈ జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.

లక్షాలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే లేఅవుట్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఎల్ఆర్ఎస్ క్షేత్రస్థాయి తనిఖీల కోసం స్పెషల్ టీమ్ లతో పాటు హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేసుకోవాలి.

మొత్తం ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సీఎస్‌కి సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్ఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి జిల్లాలోపైలట్ ప్రాజెక్టుకింద మొదటి దశలో వంద ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఇందులో ఎదురయ్యే మంచి చెడులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవాలని అధికారులను సూచించారు.

గత ప్రభుత్వంలో 2020 లో ఎల్ఆర్ఎస్ కోసం దాదాపు 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని గత నాలుగేళ్ళగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశించారు.

# సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో గొప్ప అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి..)

అందిపుచ్చుకుని ముందుకు సాగేలా కొత్త పాలసీ ఉండాలని సూచించారు.

పర్యావరణ హితంగా, టెక్నాలజీ ఉపయోగంతో తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి సాధించేలా పాలసీ రూపకల్పనపై చర్చించారు. ఈ పాలసీ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా, వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా



చేసే విధంగా చూడాలని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను మరింత విస్తృతంగా స్టడీ చేసి కొత్త పాలసీకి రూపకల్పన చేయాలని కోరారు.

2029కి, 2047 నాటికి విద్యుత్ అవసరాలు, ఉత్పత్తిని మదింపు చేసి పాలసీ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సహించేందుకు తీసుకుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. రాష్ట్రంలో కనీసం 500 చోట్ల ఈవీ చార్జింగ్ స్టేషన్లు పెట్టాల్సిన ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలు, సంస్థలు స్వయంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం, తమ అవసరాలు తీరిన తరువాత మిగిలిన విద్యుత్ ను అమ్ముకోవడాన్ని సులభతరం చేసేలా పాలసీ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో లభించే క్వార్ట్జ్ ఖనిజం ద్వారా సోలార్ విద్యుత్ పానెళ్ళు తయారు చేస్తారని.. ఈ కారణంగా సోలార్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించే అంశంపైనా దృష్టిపెట్టాలని సీఎం సూచించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 21, ఆగస్టు 2024

# ఫోర్జరీ!

- అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో మరో మలుపు
- అవినీతిని గుర్తించిన ఏసీబీ
- జోగి రమేష్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు




**విజయవాడ, మహానాడు:**

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో మరో మలుపు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ భూములను మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత జోగి రమేష్ కుటుంబం కబ్జా చేసిందన్న అభియోగాలు ఉన్నాయి. ఇందులో ఫోర్జరీ కోణం ఉన్నట్టు అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. ఫలితంగా జోగి రమేష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. జోగి రమేష్ కుటుంబానికి భూమిని విక్రయించినట్టుగా చెబుతున్న వ్యక్తి తాను అమ్మలేదని అది నకిలీ డాక్యుమెంటుగా అనిశాకు వివరణ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఫోర్జరీ కేసు కూడా నమోదు కానుంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు సమీపంలోని అంబాపురం గ్రామంలో రూ.10 కోట్ల విలువైన అగ్రిగోల్డ్ భూములను కబ్జా చేసి విక్రయించిన ఉదంతంపై అనిశా దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

జోగి రమేష్ బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు, తనయుడు రాజీవ్‌ల పేర్లపై కొనుగోలు చేసినట్టు చెబుతున్న 2 వేల 160 గజాల స్థలాన్ని తిరిగి వైఎస్సార్సీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి కుటుంబానికి విక్రయించారు. సర్వే నంబరు 88లో కొనుగోలు చేసిన ఈ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వే నంబరు 87లో ఉన్నట్టుగా లేఖ పొంది, స్వీయ సవరణ ద్వారా సబ్ రిజిస్ట్రార్ సహకారంతో రెండో సారి రిజిస్ట్రేషన్ చేయించుకొని, తిరిగి వాటిని విక్రయించారు. వాస్తవానికి సర్వే నంబరు 88లో నాలుగు ఎకరాలు బొమ్మా వెంకటచలమారెడ్డి పేరుపై ఉండేది.

దీనిలో ఎకరం పోలవరపు మురళీమోహన్‌కు, ఎకరం అద్దేపల్లి కిరణ్ కుమార్‌కు, రెండు ఎకరాలు రామిశెట్టి రాంబాబుకు 2001లో విక్రయించారు. పోలవరపు మురళీ మోహన్ 2 వేల 301 చదరపు గజాల స్థలాన్ని 2003, 2004 సంవత్సరాల్లో 11 మందికి విక్రయించారు. ఈ ప్లాట్లన్నీ సర్వే నంబరు 88లో ఉన్నాయి. అదే పోలవరపు మురళీమోహన్ జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్?లకు విక్రయించినట్టు 2022లో రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

ఈ క్రమంలో దర్యాప్తు సంస్థ పోలవరపు మురళీ మోహనన్‌ను కూడా నిందితుడిగా చేర్చింది. ఆయన తన వాంగ్మూలంలో తాను జోగి కుటుంబానికి విక్రయించలేదని, ఆ డాక్యుమెంట్లు తనవి కావని స్పష్టం చేశారు. డాక్యుమెంట్లలో మురళీమోహన్ ఆధార్ నంబరు చివరి అంకెలు 6251గా ఉన్నాయి. కానీ వాస్తవానికి ఆయన ఆధార్ నంబరు 5420గా ఉంది. 6251 నంబరు కర్రి రత్నం పేరుతో ఉంది.

గ్రామ సర్వేయర్ దేదీప్యను ప్రశ్నించగా, అసలు తాను సర్వే చేయలేదని అధికారులకు ఆమె వివరణ ఇచ్చారు. సర్వే చేసే సమయంలో సంబంధిత భూమి సరిహద్దుల్లో ఉన్న యజమానులకు నోటీసులు జారీ చేయాలి. కానీ నోటీసులు ఇవ్వకుండా ఇచ్చినట్టు ఫోర్జరీ చేశారు. వీటన్నింటిపై అనిశా దర్యాప్తు చేస్తోంది.

## బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల నిర్వహణలో

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**అమరావతి, మహానాడు:**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో అధికారులు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. రాష్ట్ర సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో ఉన్న తన కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. హాస్టళ్లల్లో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టల్లోకి రానివ్వొద్దన్నారు. విద్యార్థులను కూడా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలన్నారు.

ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం...రుచికరమైన భోజనం, అల్పాహారం అందించాలన్నారు. పాడైపోయిన, పాచిపోయిన ఆహారాన్ని విద్యార్థులకు అందివ్వొద్దన్నారు. వార్డెన్లు రాత్రిళ్లు హాస్టళ్లలోనే బస చేయాలని మంత్రి



తెలిపారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శిస్తూ... కింది స్థాయి సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఉండాలని మంత్రి స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, బీసీ గురుకులం కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్ల నిధుల విడుదల

- స్థానిక సంస్థల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- సీఎం చంద్రబాబు సూచనల మేరకు నిధులు విడుదల
- గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే.. మేం బలోపేతం చేస్తున్నాం
- ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి, మహానాడు:**

గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి అని మహాత్మ గాంధీ ఆశయాలను పాటించే ప్రభుత్వం మాదని, స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఇంకా.. ఆయన మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఇప్పుడున్న ప్రజా కూటమి ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే స్థానిక సంస్థలకు మరిన్ని నిధుల విడుదలకు నిర్ణయం తీసుకున్నాం.

గ్రామ పంచాయతీలకు రూ.998 కోట్లు, పట్టణ స్థానిక



సంస్థలకు రూ.454 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకున్నాం. ఈ నిధులతో గ్రామ, వార్డు స్థాయిల్లో పనులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ నిధుల విడుదలతో స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం కలుగుతుంది. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే.. ప్రజా కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తోంది.

# త్వరలోనే స్థానిక సంస్థల సమస్యలన్నింటికీ పరిష్కారం

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మహానాడు:**

ఆర్థికంగా ఉన్న సమస్యలు తొలగించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, జవాబుదారీతనంలో రాష్ట్ర స్థానిక సంస్థలను ముందు వరుసలో నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించిన స్థానిక సంస్థలకు చెందిన రూ.1,452 కోట్లను ఇప్పుడు కూటమి ప్రభుత్వం విడుదల చేయడమే అందుకు నిదర్శనం అన్నారు. ఈ విధంగా పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధుల కొరత లేకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదని, వాటి సాయంతో ప్రజల అవసరాలు, సమస్యలను తీర్చాల్సిన బాధ్యత మాత్రం స్థానిక సంస్థలపైనే ఉందన్నారు.

చిలకలూరిపేట మెయిన్ బజార్, కేబీ రోడ్డు, మార్కెట్ రోడ్డులోని మురుగు కాల్వలను ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీరు రహదారిపై పారుతుందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వర్షాలు కురిసినప్పుడు మురుగు కాల్వల్లో నీరు నిలిచి చాలా అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. మురుగు కాల్వల్లో తక్షణమే వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాల్వలపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మార్కెట్ సెంటర్ పరిధిలో వాహనాల పార్కింగ్ స్థలం లేక రహదారిపైనే నిలుపుతున్నారని, దాంతో రాకపోకలకు



తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఆ సమస్యపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. అధికారులంతా గత ప్రభుత్వ వాసనల్ని పూర్తిగా వదిలించుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని నిరంతరం దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి సూచించారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు ంనిరంతరం కృషి చేయాలి

- డీజీపీ ద్వారక తిరుమలరావు

**ఒంగోలు, మహానాడు:**

తిరుపతి శ్రీ సిటీ నుండి విజయవాడకు వెళ్తూ మార్గమధ్యలోని ఒంగోలు పోలీస్ కార్యాలయాన్ని డీజీపీ ద్వారక తిరుమలరావు తనిఖీ చేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్(ప్రస్తుతం ఆయన ఒంగోలులోని పోలీసు శిక్షణ కేంద్రం (పీటీసీ) ప్రధానాచార్యుడు) డీజీపీని ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన హంగులతో అన్ని సదుపాయాలతో నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్‌ను డీజీపీ పరిశీలించారు.

ఈ సందర్భంగా డీజీపీతో జిల్లా ఎస్పీ జిల్లాలోని భౌగోళిక స్థితిగతులు,శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, పోలీస్ సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలు, జిల్లాకు సంబంధించిన పలు అంశాల గురించి వివరించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకోవలసిన పూర్తి చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అలాగే చెడునడత కలిగిన వారిలో మార్పు తెచ్చేందుకు విజయవంతంగా సత్ప్రవర్తన కార్యక్రమాన్ని కొనసాగించడంపై డీజీపీ ప్రత్యేకంగా జిల్లా ఎస్పీని, పోలీసు అధికారులను అభినందించారు.

జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రకాశం పోలీస్ సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం, అలాగే కళాశాలలను ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు సందర్శించి విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించడం, జిల్లాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నందుకు జిల్లా పోలీసులను ప్రశంసించారు.

జిల్లాల్లో శాంతిభద్రతలను పరిరక్షించటంలో ప్రతి పోలీస్ అధికారి కృషి చేయాలని, ప్రజలకు పోలీసు సేవలను అందించడంలో పారదర్శకతతో పనిచేస్తూ, ప్రతి ఒక్కరూ జవాబుదారీ



తనంతో వారి వారి విధులను నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని సిబ్బంది అందరూ క్రమశిక్షణతో మెలుగుతూ, పోలీస్ శాఖ గౌరవం పెంపొందించేలా సరైన నడవడికతో ఉత్తమ సేవలను అందించాలని డీజీపీ ఎస్పీకి సూచించారు. ప్రకాశం జిల్లా ఎస్పీగా దామోదర్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లాలో పట్టు సాధించడంపై, అలాగే పోక్సో యాక్ట్ కేసులకు సంబంధించి ఎస్పీ సత్వరమే చర్యలు తీసుకోవడంపై డీజీపీ అభినందించారు.

## భవన నిర్మాణాలకు

# త్వరితగతిన అనుమతులు

- సింగిల్ విండో ద్వారా అనుమతులిచ్చేలా ఏర్పాట్లు చేయండి
- టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలకు అడ్డుకట్ట కోసం రిజిస్ట్రేషన్ శాఖతో సమన్వయం
- ఆన్‌లైన్ అనుమతులను ఏకీకృతం చేయడంపై మంత్రి నారాయణ సమీక్ష



**అమరావతి, మహానాడు:**

భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి త్వరితగతిన అన్ని అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. భవనాల నిర్మాణాల కోసం అనుమతులిచ్చే శాఖల అధికారులతో మంత్రి మంగళవారం సమీక్షించారు. సీడీఎంఏ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పురపాలక శాఖ కమిషనర్, డైరెక్టర్ హరినారాయణన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ శేషగిరి బాబుతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, గనులు, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకూ ఆయా శాఖల వారీగా అనుమతులు జారీ చేస్తున్న విధానం, అనుమతుల మంజూరుకు తీసుకుంటున్న గడువు వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలను ఆన్ లైన్ విధానంలో అనుసంధానం చేసేలా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆయా శాఖలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల ఒక్కో శాఖ నుంచి అనుమతి రావడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ జాప్యాన్ని తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

భవన నిర్మాణాల కోసం అగ్నిమాపక శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం ప్రస్తుతం పరిశ్రమలకు ఇస్తున్న ఆన్ లైన్ అనుమతుల అప్లికేషన్‌ను డీపీఎంఎస్ వెబ్ సైట్‌కు అనుసంధానం చేస్తే సరిపోతుందని సూచించారు. ఇక గనుల శాఖ కూడా పెద్ద పెద్ద భవనాల విషయంలో అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణాల కోసం భారీ గుంతల తవ్వకాల కోసం గనుల శాఖ అనుమతి తప్పనిసరి. దీనికి సంబంధించి సీనరేజి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలకు అనుమతుల విషయంలో ప్రస్తుతం ఇదే రకమైన విధానాన్ని పాటిస్తున్నారు. ఈ విధానాన్నే భవన నిర్మాణాల అనుమతులకు అనుసంధించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు..

మరోవైపు భవనం నిర్మాణం సమయంలోనే ఎంతమేర ఇసుక అవసరం అవుతుందనేది కూడా తమకు ఇవ్వాలని గనుల శాఖ అధికారులు కోరారు. దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ చీఫ్ ఇంజినీర్ గోపాల కృష్ణా రెడ్డికి మంత్రి నారాయణ సూచించారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి కూడా రెవెన్యూ అధికారులు ఇచ్చే అనుమతులు సులభతరం చేయాలని నిర్ణయించారు. దీంట్లో భాగంగా ఇప్పటికే పరిశ్రమల శాఖకు ఇస్తున్న విధానాన్ని ఏకీకృతం చేయాలని నిర్నయించారు. ఆయా శాఖల సమన్వయంతో సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేసేలా వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు.

### అక్రమాలకు అడ్డుకట్ట కోసం రిజిస్ట్రేషన్ శాఖతో సమన్వయం

గత ప్రభుత్వ హయాంలో వందల కోట్ల అక్రమాలు చోటు చేసుకున్న టీడీఆర్ బాండ్ల జారీపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. భవిష్యత్తులో బాండ్ల జారీలో అక్రమాలు జరగకుండా ఉండేలా పగడ్బందీ చర్యలు తీసుకుంటుంది. దీనికోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ అంశంపై ఓసారి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో చర్చించిన మంత్రి నారాయాణ... నేటి సమావేశంలో ఈ అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

వాస్తవంగా భూమి కోల్పోతున్న సర్వే నెంబర్ కు బదులు దొంగ సర్వే నెంబర్లు వేసి బాండ్ల కోసం దరఖాస్తు చేస్తున్నారనే విషయం ప్రస్తావనకు వచ్చింది. రిజిస్ట్రేషన్ శాఖలో ఇంటి నెంబర్ల డేటా లేకపోవడంతో సర్వే నెంబర్లు, అక్కడ ప్రాంతం ఆధారంగా భూముల ధర నిర్ధారిస్తున్నారు.

ఇలా నిర్ధారించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. బాండ్ల జారీ సమయంలో భూమికి సంబంధించిన ఈసీలు ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా వచ్చేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలన్నారు. ఓనర్ షిప్ డాక్యుమెంట్ లు కూడా ఆన్ లైన్ లో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ శేషగిరి బాబు చెప్పారు. వారంరోజుల్లో పట్టణ ప్రణాళిక శాఖకు టీడీఆర్ బాండ్ల జారీకి అవసరమైన అన్ని అంశాలతో సమీ కృతం చేసేలా సాంకేతిక పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# 'వెలుగొండ' పనుల్లో నాణ్యత లేదు

- మంత్రి నిమ్మల

**అమరావతి, మహానాడు:**

వెలుగొండ ప్రాజెక్ట్ పటిష్ఠతపై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. వెలుగొండ హెడ్ రెగ్యులేటర్ పనుల్లో నాణ్యత లేదని, పనులు కడపకు చెందిన కాంట్రాక్టర్ చేపట్టారన్నారు. ఒక్కపైసా పెండింగ్ లేకుండా బిల్లులన్నీ డ్రా చేసేసుకున్నారని తెలిపారు. వెలుగొండ పనులు చేపట్టిన అధికారులే ఈ విషయాన్ని చెబుతున్నారు. వాళ్ల మెడకు చుట్టుకుంటుందనే భయంతో అధికారులు వాస్తవాలు బయటపెడుతున్నారన్నారు.



వెలిగొండ ప్రాజెక్టు



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 21, ఆగస్టు 2024

## ఛత్తీస్‌గఢ్‌కు జర్నలిస్టుల కేసుపై రీ ఎంక్వైరీ

- **హోమ్ మంత్రి వంగలపూడి అనిత**

అమరావతి, మహానాడు:

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు జర్నలిస్టులపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసుపై రీ ఎంక్వైరీకి ఆంధ్రప్రదేశ్ హోమ్ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యు) నేతలు హోమ్ మినిస్టర్‌ను కలిశారు. ఆ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు కేసు పూర్వ పరాలను వివరించారు. ఈ కేసుపై ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు స్పందించి కొండ సబ్ ఇన్ స్పెక్టర్‌ను సస్పెండ్ చేసిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువెళ్ళారు. జర్నలిస్టులపై అక్రమ కేసు నమోదులో చింతూరు సీఐ పాత్ర ఉందని వెంటనే వెరిఫై చేసి కేసు ఎత్తివేయాలని కోరారు. వెంటనే స్పందించిన హోంమంత్రి.. అల్లూరి సీతారామ జిల్లా ఎస్పీతో మాట్లాడి ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ ఘటనపై రీ ఎంక్వయిరీ చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశాల ఇచ్చారని నాయకులు తెలిపారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని యూనియన్ నేతలు



కోరారు. ఈ సందర్భంగా అనేక కేసులను వివరించారు. జర్నలిస్ట్‌లపై దాడులు చేసిన కేసులను పునర్విచారణ చేసి దోషుల పై చర్యలు తీసుకోనే విధంగా పోలీస్ శాఖను ఆదేశించాలని సూచించారు. తప్పకుండా న్యాయం చేస్తానని హోంమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, యూనియన్ రాష్ట్ర నాయకులు కృష్ణ మోహన్, సచివాలయ జర్నలిస్టులు సత్యనారాయణ, రామకృష్ణ, ప్రసన్నకుమార్, విజయ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిలోపు రిటైర్ అయ్యే ఉద్యోగులకు బదిలీలు వద్దు

- **బొప్పరాజు, పలిశెట్టి**

అమరావతి, మహానాడు:

ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగుల బదిలీల నుంచి ఏడాదిలోపు రిటైర్ అయ్యే వారికి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు విన్నవించారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల ఉత్తర్వుల్లో/మార్గదర్శకాలలో 'సంవత్సరంలోపు పదవీ విరామం(రిటైర్) పొందే ఉద్యోగులకు ప్రస్తుత బదిలీల నుండి మినహాయింపు' ఇవ్వలేదని తెలిపారు. దానివలన 62 ఏళ్ళ వయసులో అనేక శారీరక జబ్బులతో (షుగర్, బీపీ, హార్ట్ పేషంట్స్ మొ..) ఉంటారని, అలాంటి వయసులో ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం నుండి బదిలీ చేస్తే తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా వారి పెన్షన్ పేపర్లు ఆరు మాసాలు ముందుగా తయారు చేసుకుని పెన్షన్ కొరకు పంపాల్సిన అవసరం ఉంటుందని ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. అలాగే గతంలో 2016వ సంవత్సరంలో నాటి ప్రభుత్వం కూడా సంవత్సరం లోపు రిటైర్ అయ్యే ఉద్యోగులకు



బదిలీల నుండి మినహాయింపు ఇచ్చిందని గుర్తు చేస్తూ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీని, ముఖ్యమంత్రి కార్యా లయ అధికారులను వారు మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు స్పందించి, ఒకట్రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారని ఏపీజేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.

### రాష్ట్ర సంపదను అంకిత భావంతో

## ఉద్యోగులు ప్రజలకు చేరవేయాలి

- **తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం మన అందరి బాధ్యత**
- **నష్టాల నుంచి విద్యుత్ సంస్థలను గట్టెక్కించే బాధ్యత మనందరిది**
- **ఆర్థిక ఇబ్బందులు ఉన్న మీ ఆకాంక్షలను నెరవేర్చడానికి పదోన్నతులు కల్పించాం**
- **సాధ్యమైనంత మేరకు ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం**
- **ఎన్పిడిసిఎల్ అధికారులు, ఉద్యోగులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**
- **పదోన్నతులు కల్పించినందుకు ప్రజా ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు**





హైదరాబాద్, మహానాడు:

రాష్ట్ర సంపదను ప్రజలకు చేరవేసే క్రమంలో ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ ఉద్యోగుల ప్రయోజనం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందని వెల్లడించారు. నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి ముందు ఉందన్నారు.

భవిష్యత్తు తరాలకు ఈ సంస్థలను అందించాల్సిన కర్తవ్యం కూడా మన పైన ఉందని ఉద్బోధ చేశారు. మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ఎన్పీడీసీఎల్ సంస్థలో ఒకేసారి 2320 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టి ఆర్ వి కె ఎస్, సిఐటియు, టీఈఈఏ, పి ఈ ఏ, డి ఏ, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్, ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, 327 ఎంప్లాయిస్ యూనియన్, 1104 ఎంప్లాయిస్ యూనియన్ సంబంధించిన ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల విద్యుత్ రంగ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వాటిని తిరిగి లాభాల్లోకి తీసుకురావడానికి మనందరం సమిష్టిగా కష్ట పడాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ రూపొందించే నిర్దిష్టమైన ప్రణాళికలను క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు సంపూర్ణంగా అమలు చేయడం వలనే కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ప్రతి ఉత్పత్తికి కరెంట్ అవ సరమని ఉత్పత్తి పెరగడం వలన ఆదాయం పెరుగుతుందని తద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని విద్యుత్ ఉద్యోగులు మర్చిపోవద్దన్నారు.

మనిషి బ్రతకడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో రాష్ట్ర అభివృద్ధికి రెప్పపాటు కూడా కరెంటు పోకుండా ఉండడం అంతే అవసరం అన్న విషయాన్ని గమనంలో పెట్టుకొని వినియోగదారులకు మరింత మెరుగుగా, నాణ్యమైన సేవలను అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగులు అందరూ ఈ రాష్ట్రం నాది, ఈ ప్రభుత్వం నాది, ఈ రాష్ట్ర ప్రజలు నా వాళ్ళు, వాళ్ల సేవ కోసమే నేను నియమించబడ్డానని భావించాలని సూచించారు. మీ కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుంది.

మీరు ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు పెట్టే ప్రతి సంతకం, తీసుకునే ప్రతి నిర్ణయం, చేసే ప్రతి పని సామాన్యునికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. మీ పనిలో మానవీయ కోణం ఉండాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం ఇదే తరహా ప్రోత్సాహాన్ని కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. సాధ్యమైనంత మేరకు ఉద్యోగుల సమస్యలన్నింటిని పరిష్కరించడానికి మా మంత్రిమండలి కృషి చేస్తుందని చెప్పారు. పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. మీ పిల్లలు బాగా చదువుకోవాలని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస రావు, ఆయా ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.





**ప్రమాదవశాత్తు మరణించిన నిడదవోలు నియోజకవర్గం, పెరవలి మండలం, అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సాపిరెడ్డి గౌతమ్ కుటుంబ సభ్యులకు జనసేన క్రియాశీలక భీమా చెక్కును అందజేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్.**







## టీడీపీలో చేరిన వైసీపీ వారిని అందలం ఎక్కిస్తున్నారు

- **నారా లోకేష్ జన్మదిన ఫ్లెక్సీ పెడితే హోటల్ క్లోజ్ చేయించిన వైసీపీ నేతలు**
- **మాస్క్ పెట్టుకోలేదని నాడు టీడీపీ నేతలపై తప్పుడు కేసులు**
- **అధికారంలోకి వస్తే పర్మినెంట్ చేస్తామని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మోసం**
- **జీతాలు రాలేదంటూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విన్నపాలు**
- **టీడీపీలో చేరిన వైసీపీ వారిని అందలం ఎక్కిస్తున్నారంటూ నేతల ఫిర్యాదు**

మంగళగిరి, మహానాడు:

తన తండ్రి తోపుడు బండ్లమీద పండ్లు అమ్ముతాడని... తాను పరుగు పందెంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో 26 పతకాలు సాధించినట్లు.. పై స్థాయికి వెళ్లడానికి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని తన తండ్రి తోపుడు బండితోనే తమ కుటుంబం బతుకుతోందని తనకు ఒలంపిక్స్‌లో ఆడాలని కోరికగా ఉందని పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపాలిటీ పెద నాల్గా బజారు చెందిన షేక్ అబ్దుల్లా విన్నవించారు. భారత దేశం తరఫున ఆడి దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేందుకు సాయం చేయాలని అందుకోసం తర్ఫీదుకు నెలకు రూ. 15 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి, ఎమ్మెల్సీ అశోక్ బాబు, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, బుచ్చిరాం ప్రసాద్‌లకు వినతిపత్రం అందించి విజ్ఞప్తి చేస్తూ సాయం అర్థించాడు. ఈ సందర్భంగా మంత్రి, నేతలు వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించి పరిష్కారానికి అధికారు లకు ఫోన్లు చేశారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

- వైసీపీ మద్దతుదారుల మాటలు నమ్మి ఎటువంటి విచారణ లేకుండా.. 24 జూన్ ఏడోతేదీ రాత్రి ఏడు గంటల సమయంలో ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ అంజనిరెడ్డి, పీసీ ధనుంజయ, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ రామాంజనేయులు తమ ఊరిలోకి వచ్చి శిలాఫలకం పగలగొట్టామని వంకబెట్టి.. బండబూతులు తిడుతూ.. లాఠీలతో కొట్టారని, బూటు కాళ్లతో తన్నారని.. మాదిగ నా కొడక అంటూ కులం పేరుతో దూసించారని.. అడ్డుకోబోయిన ఆడవారిని బట్టలు ఊడదీసి బజారులో పోలీసు జీపునకు కట్టుకుని తిప్పుతామని బెదిరించారని.. సాధారణ ఎన్నికల్లో తాము టీడీపీకి మద్దతు తెలిపామన్న కోపంతో ఇదంతా చేశారని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్‌లో అనంతపురం జిల్లా శింగనమల మండలం, సలకం చెరువు గ్రామానికి చెందిన తాడిమేరి తిరుపాలు, ఎస్సీ కులానికి చెందిన రాజారాముడు ఫిర్యాదు చేశారు.
- తన పొలానికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా తనను బలత్కరించి బండరాయితో వైసీపీ గుండాలు చంపబోయారని.. దానిపై పోలీసలకు ఫిర్యాదు చేయబోతే నిందితులు వైసీపీ అనుచర గుండాలని భయపడి చర్యలు తీసుకోక పోగా.. తమనే ఊరు విడిచి పారిపోవాలని అప్పటి డిఎస్పీ చైతన్య హెచ్చరించారని కావున వైసీపీ గుండాలకు కొమ్ము కాసిన పోలీసులు, వైసీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లాకు చెందిన సరోజా విజ్ఞప్తి చేశారు.
- తాము చిత్తూరు జిల్లాలో హోంగార్డ్స్ గా పనిచేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్డర్ కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. సొంత జిల్లాను వీడి 120 కిలోమీటర్ల అవతల అన్నమయ్య జిల్లాలో తమను పనిచేయమని చెబుతున్నారని చిత్తూరు నుండి వచ్చిన హోంగార్డులు గ్రీవెన్స్‌లో వాపోయారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను వీడి మరొక జిల్లాలో పనిచేయడానికి ఇబ్బందిగా ఉందని.. తమను సొంత జిల్లాలోనే ఉండేలా సహకరించాలని వారు మంత్రికి వినతి పత్రం అందిచారు. దీనిపై మంత్రి చిత్తూరు జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.
- ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలం శింగనపాలెంకు చెందిన టీడీపీ నేత శివరామ కృష్ణ విజ్ఞప్తి చేస్తూ.. గత ఐదేళ్లు వైసీపీకి కొమ్ముకాసిన చంద్రమౌళి అనే వ్యక్తి నేడు టీడీపీలో చేరి వైసీపీ నేతలతో తిరుగుతూ ఎస్సీలకు పదవులు దక్కకుండా చేస్తున్నారని దాంతో టీడీపీకి ఎస్సీలు దూరం అయ్యే అవకాశం ఉందని.. పార్టీ పెద్దలు ఇలాంటి వారి చర్యలను గుర్తించి నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.
- గత ప్రభుత్వంలో నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసినందుకు తన హోటల్ ను క్లోజ్ చేయించి.. మాస్క్ పెట్టుకోలేదని తమపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని, తమపై పెట్టిన తప్పుడు కేసులను తొలగించాలని తంబళ్ల పల్లెకు చెందిన ప్రకాశ్ బాబు గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.
- గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను పర్మినెంట్ చేస్తామని చెప్పి చేయకుండా మోసం చేసిందని... పెంచిన అరియర్స్ కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని.. తమ తమస్యలను పట్టించుకోకుండా గాలికొది లేసిందని.. తాము ఏపీ జెన్ కో, ఏపీ ట్రాన్స్, డిస్కాంల్లో ఏళ్ళుగా 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులం చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని వారు తెలిపారు. తమను పర్మినెంట్ చేసి... విద్యుత్ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యాలనే నేరుగా వేతం ఇచ్చేలా చూడాలన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తోన్న కాంట్రాక్టు కార్మికులకు 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఏపీలో జెన్ కోలో కార్మిక సంఘాలకు గుర్తింపు ఇవ్వకుండా.. అణిచివేతకు పాల్పడు తోందని.. ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.
- చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్య పల్లె పంచాయతీ మాకాంబాపురం గ్రామానికి చెందిన చెంగల్రాయ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామానికి చెందిన పశువుల మేత పోరంబోకు, కాలువ పోరంబోకు కుంటల పోలాలను హరిరామ్ అనే వ్యక్తి ఆక్రమించుకొంటున్నాడని.. అంతే కాకుండా తమ పొలానికి దారి లేకుండా చేశాడని కలిసి వినతి పత్రం అందించారు. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- 1998 డిఎస్సీ ఎమ్టీఎస్ టీచర్స్‌గా ఉన్న తమను 2023వ



సంవత్సరంలో నియమించారని.. కాని నియామకాలు అప్పుడెప్పుడో పరీక్ష రాసిన జిల్లాల్లో ఇవ్వడం వలన ఇబ్బందులు పడుతున్నామని పలువురు అభ్యర్థులు వాపోయారు. ఉపాధి కోసం వేర్వేరు జిల్లాలకు వెళ్లి స్థిరపడిన తమకు పరీక్ష రాసిన జిల్లాల్లో ఉద్యోగాలు కల్పించడం వలన కుటుంబాలకు దూరమై వయస్సు రీత్యా అనారోగ్య సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యను పరిష్కరించాలని వారు విన్నవించుకొన్నారు.
- ఆప్కాస్ ద్వారా విశాఖ కేజీహెచ్, అనకాపల్లి మెడికల్ కాలేజీల్లో గ్రూప్ 4 ఎంప్లాయిస్‌గా పనిచేస్తున్న తమకు కొన్ని నెలలుగా జీతాలు రావడంలేదని.. తమ సమస్యను పరిష్కరించి జీతాలు వచ్చేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్సీ అశోక్ బాబు అధికారులతో మాట్లాడి సమస్యను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.
- డీసీసీ స్పెషల్ క్యాడర్ రిటైర్డ్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తూ.. ప్రభుత్వంతో నియామకమై అష్టకష్టాలు పడి రైతుల అభివృద్ధి, సంఘ అభివృద్ధి, సహకార బ్యాంకుల అభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేసిన తమకు రిటైర్ మెంట్ కు ముందస్తు మూడేళ్ళు మాత్రమే బ్యాంకు స్కేల్ ఇచ్చారని... తమకు 35 ఏళ్ళు పని చేసిన కాలానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులవలే జీతబత్తేలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని.. తాము 1000 మంది ఉద్యోగులం ఉన్నామని, తమకు న్యాయం చేయాలని వారు కోరుతూ గ్రీవెన్స్ లో వినతి అందించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 21, ఆగస్టు 2024

# కార్మిక రంగాన్ని సంక్షేమం వైపునకు నడిపిస్తాం

## - మత్స్యకారుడి కుటుంబానికి రూ.5 లక్షలు ఎమ్మెల్యే గద్దె పంపిణీ

**విజయవాడ, మహానాడు:** వైసీపీ ప్రభుత్వం కార్మిక రంగాన్ని పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని కార్మిక రంగాన్ని సంక్షేమం వైపునకు నడిపిస్తామని చెప్పారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ పటమటలంక గరికపాటి వారి వీధిలో నివాసి మత్స్యకారుడు మైలా వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన ఐదు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వెంకటేశ్వరరావు మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పేదలకు ఎంతో ఉపయోగంగా ఉండే చంద్రన్న బీమా పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారన్నారు. వెంకటేశ్వరరావు గత ఏడాది చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మరణించారని చెప్పారు. గత ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అదుకోలేదని చెప్పారు. అందువల్ల ఈ సంఘటన జరిగి ఏడాదికి పైగా అయినా మానవతా దృక్పథంతో నారా చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షలను అందచేశారని చెప్పారు.

చంద్రన్న బీమా పథకం ద్వారా ఏవరైనా కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు మరణించిన వ్యక్తి పెద్దకర్మ జరిగేలోపునే అందచేశారని, మరణించిన వెంటనే రూ.10 వేలు అందచేసేవారని చెప్పారు. కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉండే బీమా పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎవ్వరూ ప్రవేశపెట్టినా



అది మంచి పథకమని చంద్రబాబునాయుడు భావించి అమలు చేశారని చెప్పారు.

పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని మరింతగా చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి ఇప్పుడు ఆసుపత్రులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కొంచెం కొంచెంగా విడుదల చేస్తున్నారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, సర్రా కిషోర్, అన్నాబత్తుల బాబి, చిలకలపూడి నరసింహారావు, అన్నాబత్తుల శ్రీదేవి, పలమనేని సుబ్బారావులతో పాటు మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.





సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్



కేరళ రాష్ట్రం లో కొచ్చిన్‌లో రక్షాబంధన్ లో పాల్గొని ఎపి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి, జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌జీకి రాఖీ కడుతున్న దృశ్యం



కొచ్చిన్‌లో పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడానికి కేరళ రాష్ట్ర బిజెపి నేతలు సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి



అక్టోబర్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం అందించిన బండారు దత్తాత్రేయ. అక్టోబర్ 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం.





# వైసీపీ పాలనలో చింపిన విస్తరిలా ఆర్థిక వ్యవస్థ!

- ఎన్ని ఇబ్బందులున్నా అన్నా క్యాంటీన్ల సాగుతాయ్
- ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

**ఉండి, మహానాడు:** వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చింపిన విస్తరిలా తయారైందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దుమ్మెత్తిపోశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్నో కష్టాలలో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి చెప్పిన దానికంటే ఎక్కువగానే అన్నా క్యాంటీన్ల ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఉండి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం రఘురామ కృష్ణంరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... అన్నా క్యాంటీన్ల నిర్వహణ అనేది ప్రజల చేత నడపబడే కార్యక్రమంగా కొద్ది నెలల వ్యవధిలోనే మారాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, క్యాంటీన్ల నిర్వహణకు సహకరించడం ద్వారా, మానవత్వాన్ని చాటుకున్నట్లు అవుతుందన్నారు. కచ్చితంగా నా నియోజకవర్గ పరిధిలో నేను విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రభుత్వం తలపెట్టిన ఈ అద్భుత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

### ప్రజల చేత... ప్రజల కొరకు... ప్రభుత్వం నడిపే కార్యక్రమం అవ్వాలి

ప్రజల చేత, ప్రజల కొరకు ప్రభుత్వ సహకారంతో నడిపే కార్యక్రమంగా అన్నా క్యాంటీన్ల నిర్వహణ రూపుదిద్దుకోవాలని రఘు రామ కృష్ణంరాజు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరపున నేను,నాతోపాటు మిగిలిన శాసన సభ్యులు, ముఖ్యమంత్రి ఆలోచనలకు ఒక స్ఫూర్తినిచ్చేలాగా ముందుకు వెళ్తామన్నారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణకు ఎవరైనా కోటి రూపాయలు విరాళం ఇచ్చేవారు ఉంటారు. కోటి రూపాయలు ఇచ్చినవారికి ఎంత పుణ్యమో వస్తుందో, డబ్బులు లేని పేదవారైనా సరే... పదిమందికి అన్నం పెట్టడం ద్వారా అంతే పుణ్యం వస్తుంది. వారు చేపట్టే కార్యక్రమం కూడా అంతే స్ఫూర్తిదాయకం.

మంచి మనసు ఉన్నదా లేదా అన్నదే ఇక్కడ అవసరమని రఘురామకృష్ణం రాజు పేర్కొన్నారు. పదిమందికి అన్నం పెట్టాలన్నది మన సంస్కృతిలో ఒక భాగమని, ప్రతి మతంలోనూ ఆకలితో ఉన్న ఆపన్నులకు అన్నం పెట్టమనే చెబుతాయని గుర్తు చేశారు. ఆకలితో ఎవరు ఉండకూడదనే, పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలన్న అన్న ఎన్టీ రామారావు స్ఫూర్తితో ఆయన పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భవిష్యత్తులో ప్రజల సహకారం వల్ల, ప్రభుత్వంపై ఎటువంటి భారం పడకూడదని ఆకాంక్షిస్తున్నట్లు రఘురామకృష్ణం రాజు తెలిపారు.

### రెండు చోట్ల అన్నా క్యాంటీన్లు

ఉండి నియోజకవర్గ పరిధిలో రెండు ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. తొలుత ఉండి నియోజకవర్గ పరిధిలో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు నిబంధనల ప్రకారం సుముఖతను వ్యక్తం చేయకపోవడంతో, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి ఆకివీడులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించాను. నియోజకవర్గ కేంద్రాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ కేంద్రాలు మున్సిపాలిటీలు కాకపోయినా, మేజర్ గ్రామపంచాయతీలుగా కొనసాగుతూ, మున్సిపాలిటీ లు గా రూపాంతరం చెందడానికి దగ్గరగా ఉంటాయి. అటువంటి కేంద్రాలలో కూడా అన్నా క్యాంటీన్‌ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని సూచించాను.

ఒకవేళ ఉండి నియోజకవర్గ పరిధిలో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు నిబంధనల ప్రకారం అనుమతి లభించకపోతే గ్రామ పెద్దలు, రైతులు, దాతల సహకారంతో సామాజిక బాధ్యతగా, నేనే క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాను. అవసరం ఉన్నప్పటికీ అన్నీ చోట్ల అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో ప్రజలు ముందుకు



రావాలని కోరాను. అయితే పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ వారు సోమవారం నియోజకవర్గ పరిధిలోని ఆకివీడు, ఉండి మేజర్ గ్రామపంచాయతీలను పరిశీలించి స్థానికంగా అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

ఉండి నియోజకవర్గ పరిధిలో రెండు చోట్ల, అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు కేంద్రాలలో స్థలం ఎంపిక అనంతరం, అన్నా క్యాంటీన్ల నిర్మాణ స్ట్రక్చర్ పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారన్నారు. నా కోరిక మేరకు ఉండి నియోజకవర్గ పరిధిలో రెండు చోట్ల క్యాంటీన్ ఏర్పాటుకు చొరవ తీసుకున్న మున్సిపల్ మంత్రి నారాయణకు హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఒక్కపూటైన భారాన్ని భరించాలి

సమాజంలో ఇతరులకు సహాయం చేయగలిగే స్థితిలో ఉన్నవారు అన్నా క్యాంటీన్ల ద్వారా కనీసం ఒక్క పూటైనా తమ తల్లిదండ్రులు జీవించి ఉంటే వారి జన్మ దినోత్సవ రోజు, వివాహ వార్షికోత్సవం రోజున, అలాగే తమ పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా భోజన నిర్వహణ భారాన్ని భరించాలని రఘురామకృష్ణం రాజు కోరారు. మధ్యాహ్న భోజనం, లేదంటే రాత్రి పూట డిన్నర్‌కు అయ్యే ఖర్చును భరించి, అన్నా క్యాంటీన్ల నిర్వహణకు సహకరించాలన్నారు. తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతలు వర్ధంతుల పేరిట కూడా అన్నా క్యాంటీన్ ద్వారా ఒక పూట భోజనానికి అయ్యే ఖర్చును భరించాలన్నారు.

ముఖ్యంగా విదేశాలలో ఉన్నవారు తమ తల్లిదండ్రులు మరణించి ఉంటే వారి పేరిట కర్మ చేసినా కూడా పది మందికి భోజనం పెట్టాలని పిలిచినా వచ్చే పరిస్థితి ఉండదన్నారు. పూజారులు లేకపోతే సీడీ వేసి కార్యక్రమం నిర్వహించినప్పటికీ, అన్నదానం చేసి తమ తల్లిదండ్రులకు ఆత్మశాంతిని చేకూర్చాలనే వారి కోరిక విదేశాలలో నెరవేరే అవకాశం లేదన్నారు. అటువంటివారు అన్నా క్యాంటీన్లను వేదికగా చేసుకోవాలని సూచించారు. ఒకవేళ తమ పట్టణంలో అన్నా క్యాంటీన్ లేకపోతే, మండల పరిధిలో అన్నా క్యాంటీన్ ఉన్న చోట ఒకపూట భోజనానికి అయ్యే ఖర్చు భరించాలన్నారు.

### ల్యాండ్, శాండ్, వైన్‌లలో అవినీతి, అక్రమాలు బయటకు రావడం హర్షణీయం

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ల్యాండ్, శాండ్, వైన్ లలో అవినీతి, అక్రమాలు, అవకతవకలు, కుంభకోణాలు వెలుగులోకి రావడం హర్షణీయమని రఘురామకృష్ణం రాజు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైల్వే విభాగానికి చెందిన ఒక జూనియర్ మోస్ట్ అధికారి అయిన వాసుదేవరెడ్డిని మైనింగ్, లిక్కర్ విభాగం బాధ్యతలను ఆనాటి ప్రభుత్వ పెద్దలు అప్పగించారు. లిక్కర్, మైన్ లలో అక్రమాలు, అవకతవకలపై గత నాలుగేళ్లలో 100 సార్లకు పైగా మాట్లాడుకున్నాం. జూనియర్ మోస్ట్ అధికారికి ఏ ప్రాతిపదికన పెద్ద బాధ్యలను అప్పగించారు?

జే బ్రాండ్స్ అమ్మకం ద్వారా నగదును వసూలు చేశారు. ఒకవైపు ప్రధాన మంత్రి డిజిటల్ కరెన్సీ అంటుంటే, మీరు మాత్రం నగదు...నగదు అని ప్రాకులాడారు. వీటన్నింటి గురించి ఎన్నోసార్లు మాట్లాడుకున్నాం. వాసుదేవ రెడ్డి రెండు నెలలుగా కనిపించడం లేదన్నారు. బెంగళూరులో దొరికినట్లు, అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వాసుదేవ రెడ్డి దొరికినప్పటికీ, అతడి వ్యవహారాలన్నీ వెలుగులలోకి రావలసిన అవసరం ఉందన్నారు.

రాష్ట్ర మైనింగ్ వ్యవహారాలను చూసిన వెంకట్ రెడ్డి, కోస్ట్ గార్డ్ సర్వీస్‌కు చెందిన వారని తెలిపారు. కోస్ట్‌గార్డ్ సర్వీస్‌కు మైనింగ్‌కు సంబంధం ఏమిటో, అతన్ని ఆ సర్వీస్ లకు తీసుకొచ్చిన వారికే తెలియాలి. గనుల వ్యవహారాలను చూసిన వెంకట్ రెడ్డి కూడా ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. మైనింగ్ వ్యవహారాలలో చాలా విషయాలు బయటకు రావాల్సి ఉందన్నారు. మైనింగ్, శాండ్స్ వ్యవహారాలను తొలుత చూసిన మధుసూదన్ రెడ్డిని ఆ తరువాత ఫైబర్ నెట్ కు మార్చారు. ఫైబర్ నెట్‌లోను ఎన్నో అవకతవకలు జరిగాయి. మధుసూదన్ రెడ్డి వెనక్కి వెళ్లి పోతానంటే, అతడిని సస్పెండ్ చేసి నిలిపారు. గతంలో వెంకట్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మధుసూదన్ రెడ్డి వీరందరినీ ఎక్కడి నుంచో ఏరి కోరి ఇటువంటి ఆణిముత్యాలను తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వంలోని పెద్దల అడుగులకు మడుగులొత్తితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించినప్పటికీ, జగన్మోహన్ రెడ్డి 10 ఏళ్ల పాటు అధికారంలో ఉంటారని అనుకున్నారేమో కాబోలు, వారిపై చంతాడంత ఆరోపణలు ఉన్నాయి. ఈ ముగ్గురిపైన చాలా స్పష్టంగా ఆరోపణలు ఉన్న దృష్ట్యా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రఘురామకృష్ణంరాజు అన్నారు.

### హెచ్‌ఆర్డీ మంత్రి లోకేష్‌కు అభినందనలు

గత ప్రభుత్వ హయాంలో బాత్రూమ్‌ల ఫోటోలు తీసి అప్లోడ్ చేసే బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించగా, వారిని ఆ బాధ్యతల నుంచి తప్పించిన హెచ్‌ఆర్డీ మంత్రి నారా లోకేష్ కు ఉపాధ్యాయ సంఘాల తరఫున హృదయపూర్వక అభినందనలను తెలియజేస్తున్నట్టు కృష్ణంరాజు తెలిపారు. గతంలో ఇదే విషయమై ఎన్నోసార్లు రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుకున్నాం. ఉపాధ్యాయులను గౌరవించాలని, ఉపాధ్యాయుల చేత బాత్రూంలో ఫోటోలు తీయించి అప్లోడ్ చేయించడం సరికాదని సూచించినా, అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. బాత్రూంలో పర్యవేక్షణ బాధ్యతను హెడ్మాస్టర్ లకు అప్పగించి వారిని అగౌరవపరిచింది. ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వడం మాట దేవుడెరుగు... అగౌరవపరిచారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఈ విషయంలో స్పందించి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఈ తప్పును సరిదిద్దాలని ఆదేశించారు. వెంటనే నారా లోకేష్,




బాత్రూంల పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించారు. గ్రామ సచివాలయం, మున్సిపాలిటీ సచివాలయాలలో విద్యా కార్యదర్శులను పనిచేసే వారికి బాత్రూంలో పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. సోమవారం, గురువారం ఫోటోలను తీసి అప్లోడ్ చేసే బాధ్యతలను వారికి మంత్రి నారా లోకేష్ కట్టబెట్టారు. గురుబ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వర అన్న నానుడి ప్రకారం వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలన్నారు.

### విజయ్ పాల్ పాత్ర స్పష్టం...

పోలీస్ కస్టడీలో నన్ను టార్చర్ పెట్టిన సంఘటనలో విజయ పాల్ పాత్ర సుస్పష్టం... కోర్టు వద్ద పూర్తి సమాచారం ఉందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. విజయపాల్ గతవారం కోర్టులో ఇంట్రిమ్, యాంటీ స్పెటరీ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పటినుంచి విజయ్ పాల్ పరారీ లో ఉన్నాడు. విజయ్ పాల్ ఇంట్రీమ్ బెయిల్ కోసం సిద్ధార్థ లూత్ర వాదనలు వినిపించారు. విజయపాల్ ఎన్నాళ్లు దాక్కుంటాడో చూడాలన్నారు. విజయ్ పాల్‌కు ఒకవేళ బెయిల్ లభిస్తే, ఈ కేసులో మిగతా నిందితులు కూడా ఒకరి తర్వాత ఒకరు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంటారేమోనని అన్నారు. ఈ కేసు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించిన ఆయన, హెడ్ కానిస్టేబుల్ ఈ కేసు ను విచారించగలరన్నారు. అంత క్లియర్ గా ఉంది. అక్కడేమీ లేదు. కాకపోతే ఈ కేసులో డీజీ స్థాయి అధికారి ఉన్నారు కాబట్టి, డిఐజి స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ జరిగితే బెటర్‌గా ఉంటుందన్నారు. నన్ను తుద ముట్టించాలనే కుట్రలో పోలీస్ శాఖ ఉన్నత అధికారులు కీలక పాత్ర పోషించారన్నారు.

### సక్సెస్ ఫుల్‌గా పరిమళ వాటర్ స్కీమ్ ట్రయల్

ఉండి నియోజకవర్గ ప్రజలకు మంచినీటి సరఫరా కోసం పరిమళ వాటర్ స్కీం ట్రయల్ రన్ 12 కిలోమీటర్ల పాటు విజయవంతంగా కొనసాగిందని రఘురామకృష్ణం రాజు తెలిపారు. గణపవరం వద్ద మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పైపులను ఆర్డర్ ఇచ్చారని, పైపులు వస్తాయన్నారు. రెండు గ్రామాలకు నీళ్లు అందించే ఉండి కెనాల్ ఇరువైపులా ఆక్రమణకు గురైందని, ఆక్రమణలను తొలగించి కెనాల్ లో పూడిక తీసి స్థానికులకు మంచినీరు అందిస్తామని తెలిపారు.



తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డి నియామకం..



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులుగా (కేబినెట్ ర్యాంక్) ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నియామకం..



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 21, ఆగస్టు 2024

# 'రాజు' గారిని బాబు గారు ఏం చేద్దామనుకుంటున్నారు!?



భోగాది వెంకట్రాయుడు

ఇతర తెలుగుదేశం జనానికి మల్లే, "ఉండి" నియోజక వర్గం ఎంఎల్ఏ రఘు రామకృష్ణం'రాజు' ఒక చట్రంలో ఇమిడిపోయే రాజకీయ నేత కాదనే విషయం 'తెలుగు దేశం' పెద్దలకు ఈపాటికే అర్థమై ఉంటుందనడంలో సందేహం లేదు.

ఆయన దాదాపు నాలుగేళ్లు ఢిల్లీ నుంచి అప్పటి ముఖ్య మంత్రి జగన్, ఆయన చుట్టూ చేరి ఉన్న ముఖ్య నేతలపై అలుపెరగని పోరాటం చేశారు. ఆయన పోరాట పటిమకు రాష్ట్రమే నివ్వెరపోయింది.

జగన్‌పై రాజకీయ పోరాటం చేస్తున్న వారు రఘు రామకృష్ణం రాజును సమర్థించక, మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితుల్లో పడిపోయారు.

జగన్ పాలనా రీతులను తీవ్రంగా నిరసించే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్, టీవీ 5 న్యూస్ ఛానల్, ఈనాడు మీడియా కూడా ఆయనకు బాసటగా నిలబడడంతో, రఘు రామరాజు. ఆంధ్రప్రదేశ్ లో 'ఇంటింటి పేరు 'గా మారిపోయారు. లక్షల సంఖ్యలో అభిమానులు తయారయ్యారు.

జగన్ అరాచక జమానా ను ఎదిరించి పోరాడిన వారిలో అత్యధికులు – తమ తమ తమ నియోజక వర్గాలకే పరిమిత మయ్యారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ టికెట్‌పై దృష్టి పెట్టుకుని, జగన్‌పై పోరాడినవారే ఎక్కువ మంది కనిపిస్తారు.

కానీ, రఘు రామరాజు. రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా చేసుకుని పోరాడారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పోరాడారు. అందుకే, ఆయన 'స్టేట్ ఫిగర్ 'అయ్యారు. అలా, 'స్టేట్ ఫిగర్ 'గా ప్రజల ముందు ఆవిష్కృతమైన వారు మరో ముగ్గురే.

చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్. టీడీపీలోగానీ, జనసేనలోగానీ, బీజేపీలోగానీ ఇక మిగిలిన వారందరూ నియోజకవర్గం నేతలే. అయినప్పటికీ బీ ఈ "జైంట్ కిల్లర్ "కు కూటమి నుంచి రావలసిన గుర్తింపు రాలేదనే భావం. రఘురామరాజును అభిమానించే చాలా మంది లో ఉంది.

ఆయనకు చంద్రబాబు నాయుడు బాసటగా నిల బడ్డారనడంలో సందేహం లేదు. ఆయనకు నరసాపురం పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసే అవకాశం రాకపోవడం తో, చంద్రబాబు సైతం కొద్దిగా ఆశ్చర్యానికి గురైనట్టు వార్తలు వచ్చాయి.

ఆయనకు ఎంతో కొంతన్యాయం చేయడానికి చంద్ర బాబు నాయుడు నడుం బిగించారు.

అప్పటికే ఉండి నుంచి తెలుగు దేశం పార్టీ అభ్యర్థిత్వం ప్రకటించిన శివరామ రాజు ను ఒప్పించి, పోటీ నుంచి తప్పించి ఆ టికెట్ ను రఘు రామరాజుకు కేటాయించారు. నిజానికి, రఘు రామరాజుకు "ఉండి" నియోజక వర్గం కేటాయించడానికి, చంద్రబాబు నాయుడు పెద్ద కసరత్తే చేశారు.

ఆ తరువాత, అసెంబ్లీ స్పీకర్ పదవి గానీ, రాష్ట్ర కేబినెట్ లో మంత్రి పదవి గానీ వస్తుందని ఆయన భావించారు. ఊహించిన దానికంటే కూడా అత్యధిక స్థాయిలో కూటమి సభ్యులు విజయం సాధించడం తో బీ రకరకాల సమీకరణాల నేపథ్యం లో రఘు రామకృష్ణం రాజు కు అవకాశం లభించి ఉండక పోవచ్చు. ఫలితంగా, ఆయన ఎంఎల్ఏగానే మిగిలిపోయారు.

ఆ పదవి, ఆయన ఇమేజ్ కు తగినట్టుగా లేదని ఆయన పోరాట పటిమను చూస్తూ వస్తున్నవారు ఎవరైనా అంగీకరి స్తారు. నియోజక వర్గ స్థాయికి ఆయనను కుదించడం కూడా కుదరనంతగా. జగన్ పుణ్యమా అని, గత నాలుగేళ్ళల్లో ఆయన ఇమేజ్ పెరిగిపోయింది.

ఆయన ఇమేజ్‌కి తగిన స్థాయి కల్పించడమూ తెలుగు దేశం పార్టీకి అంత తెలికైన విషయం కాదు. అలా అని చెప్పి, రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగిపోయిన ఆయనను ఉండి నియోజకవర్గానికే పరిమితం చేయడమూ సముచితం అనిపించుకోదు. అందుకని ఆయనను ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్ గా పంపించడం వల్ల తెలుగు దేశం పార్టీ కి అనేక



ప్రయోజనాలు ఉన్నాయి.

తెలుగు వారి తక్షణ స్మృతి పథంలో ఆయన ప్రస్తావన ఉండదు. రఘు రామరాజుకు చంద్రబాబునాయుడు న్యాయం చేశారనే భావన, చంద్రబాబు ప్రతిష్ట ను ఇనుమడింప చేస్తుంది.

ఒక గవర్నర్‌కు ఉండవల్సిన స్టేచర్, హుందాతనం, ఇంగ్లీష్ హిందీ భాషలపై కమాండ్ ఆయనకు ఉన్నాయి.

"మన రాజ్యాంగాన్ని ఎవరు రాశారోయ్ "అని అడిగితే, " మాకెందుకు తెలియదు, ఇందిరా గాంధీ రాసింది " అని ధీమా గా చెప్పే చాలామంది సగటు రాజకీయ నేతల కంటే, రాజ్యాంగంపై రఘు రామరాజుకు మంచి అవగాహన ఉంది. లోకసభలో ఒక సభ్యుడిని అనర్హతకు ఎప్పుడు గురి చేయాలో వైసీపీ ఎంపీలకు తెలియకపోయినా రఘుకు తెలుసు. అందుకే, తల్లకిందులుగా తపస్సు చేసినా, ఆయనను లోక సభ నుంచి వైసీపీ గ్యాంగ్ బయటకు పంపించలేకపోయింది.

ప్రధానమంత్రి, ఇతర సీనియర్ కేబినెట్ మంత్రులతో సహా, వందలమంది ఎంపీలు ఆయనకు పరిచయం. ఇంత కంటే, గవర్నర్‌కు అర్హతలు ఇంకేమి కావాలి? చంద్రబాబు నాయుడు ఈ ప్రత్యామ్నాయం ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని కొందరు టీడీపీ నేతలు సైతం అభిప్రాయ పడు తున్నారు.

ఇప్పటికే, ఈశాన్య రాష్ట్రాల్లో ఇద్దరు తెలుగు వారు ఉన్నారు. కంభంపాటి హరిబాబు, ఇంద్రాసేనారెడ్డి. హర్యానా కు బండారు దత్తాత్రేయ గవర్నర్‌గా ఉన్నారు. వారు ముగ్గురూ బీజేపీ నేతలే. రఘు ను గవర్నర్‌గా పంపించడం వల్ల రాష్ట్రానికి ఏమి ఉపయోగం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావించే పక్షంలో ఆయనను ఢిల్లీ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించవచ్చు. అప్పుడు, చంద్రబాబు, మంత్రులు నిధులు, ప్రాజెక్‌ల అను మతుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది. హి ఈజ్ ఏ పొలిటీసియన్ విత్ ప్రూవెన్ టాలెంట్. ఆయన సేవ లను వాడుకోలేకపోతే, ఒక సమర్ధ నేత సేవలను సక్రమంగా వినియోగించుకోలేక పోయారన్న అపకీర్తికి ముఖ్యమంత్రి లోనయ్యే ప్రమాదం లేకపోలేదు.

# ప్రజల హృదయాల్లో చిరంజీవిది చెరగని ముద్ర

◆ గుంటూరు 'పశ్చిమ' ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మహానాడు:

పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో నాటకరంగ కళాకారులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సినీ పరిశ్రమలో ఎవరి అండదండలు లేకుండా స్వయంకృషితో అత్యున్నతస్థాయి శిఖరాలకు చేరుకున్న పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మాధవి అన్నారు. తన అసమాన నటనతో, నృత్యాలతో, ఫైట్స్ తో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది అభిమానుల్ని సంపాదించు



కున్న కళామతల్లి ముద్దుబిడ్డ చిరంజీవి అంటూ కొనియాడారు.

సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తి కళాకారులకుం దన్నారు. తెలుగువాడి సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పిన తెలుగుతల్లి కన్నబిడ్డ చిరంజీవన్నారు. నడకలోనూ నాట్యం చేయగల నటరాజుడు చిరంజీవి అంటూ వ్యాఖ్యానించారు. చిరంజీవితో పోటీ పడగల శక్తి చిరంజీవికే తప్పా మరెవరికీ లేవంటూ పేర్కొన్నారు. ఒక్క తెలుగు సినీపరిశ్రమలోనే




కాకుండా దక్షిణ భారతదేశ సినీ రంగంలో ఒకటి నుంచి పది స్థానాలూ ఆయనవేనని గళ్లా మాధవి అన్నారు. ప్రపంచ సినీ జగత్తులో అభిమానుల్ని సేవా తత్పరులుగా తీర్చిదిద్దిన ఏకైక నటుడు చిరంజీవి అని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. కళా రంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన, చేస్తున్న సేవలు అజరామరమన్నారు.

అనంతరం కళాకారులకు పది వేల రూపాయల చెక్ ను అందించారు. ప్రముఖ నాటక రంగ కళాకారులైన పాగళ్ల సురేష్, పట్టంశెట్టి చిట్టిబాబు, మన్యం వీరయ్య, పట్టంశెట్టి రాంబాబు, కుంచనపల్లి వీరరాఘవమ్మ, కుర్రా ఆంజనేయులు, యస్ కే మీరావలి, గుంజి రమణలను ఎమ్మెల్యే గళ్లా మాధవి దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాభి మానులు పాములు, కూటమి నేతలు నంది సరస్వతి, కసుకుర్తి అరుణ, రాధా కృష్ణ మూర్తి, సయ్యద్ చాంద్, లా అంజి, కొల సాని బాలకృష్ణ, స్వామి, వడ్డె సుబ్బారావు, కోల చిరంజీవి, శేషు, బాలకృష్ణ స్టూడియో, బాజి, ఖర్జూర శ్రీను, నాజర్ వలి, మిద్దె నాగరాజు తదితరులున్నారు.

# కేటీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు...

◆ కాంగ్రెస్ ఎమ్మెల్యే, టీఎస్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శ

హైదరాబాద్, మహానాడు

కేటీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని, రాజకీయాలు మీకు..మాకు అవసరమేనని, కానీ ఏం మాట్లాడాలో..ఎలాంటి విషయాలు మాట్లాడాలో వారికి తెలియడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే, టీఎస్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు.. కేటీఆర్.. ఎక్కడైనా పొలిటికల్ కోచింగ్ సెంటర్ ఉంటే కోచింగ్ తీసుకో బెటర్.. రాజీవ్ గాంధీ దేశ ప్రజల కోసం బలిదానం అయ్యారు.. మిలిటెంట్లు కాల్చి చంపింది నిజమే కదా? కేసీఆర్ గారు.. కేటీఆర్ కి కొంత ట్రైనింగ్ ఇప్పించండి.. రాజీవ్ గాంధీ విగ్రహం సెక్రటేరియట్ ముందు తీసేస్తం అంటాడా..?

ప్రజలు మాకు ఐదేళ్లు అధికారం ఇచ్చారు.. రాజీవ్ గాంధీ .. 18 ఏండ్లు ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారు. కేటీఆర్.. అమెరికాలో ఐటి ఉద్యోగం చేసిన అంటున్నావు.. ఆ ఐటిని తెచ్చింది రాజీవ్ గాంధీ. తెలంగాణ లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఐటి కి పునాది వేశారు. రాజీవ్ గాంధీ తెచ్చిన టెక్నాలజీ తో ఉద్యోగం తెచ్చుకుని ఆయన్నే తిడితే నిన్ను ఏమనాలి..? నువ్వు విగ్రహం తీసేస్త అంటే... మేము చూస్తూ ఊరుకుంటం అనుకుంటున్నావా? ఈ నాలుగేండ్లు రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకునే ధైర్యం ..దమ్ము నీకు లేదు.. వచ్చే ఐదేళ్లలో కూడా నీకు ప్రజలు అవకాశం ఇవ్వరు..? మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. నీకు నో ఛాన్స్.. మా సీఎం రేవంత్ నీ... చీఫ్ మినిస్టర్ అంటున్నావు.. కేటీఆర్ మాటలు చీప్ లిక్కర్ తాగిన వాడి మాటల లెక్క ఉన్నాయి.. కల్లు తాగిన కోతిలెక్క దుంకులాడుతున్నాడు.. కేటీఆర్..

సోనియా గాంధీ..రాహూల్ గాంధీలకు నీతిగా గులాం గురి చేస్తాం.. మీ లెక్క కన్నింగ్ కాదు మేము..

తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఇంటికి మీ కుటుంబం అంతా వెళ్లి ఆమె కాళ్ళ మీద పడ్డప్పుడు ఏమైంది.. అప్పుడు




మీరు కూడా గులాం చేసినట్టేనా? నీకు అధికారమే రాదు.. ఇంకా ఎయిర్‌పోర్ట్ పేరు ఎట్లా మారుస్తాడు కేటీఆర్. పొలిటికల్ పవర్ ఊహించుకోకండి కేటీఆర్. సోనియా గాంధీ మన్ననలు పొందటానికి ప్రయత్నాలు చేయలేదా? అల్లం నారాయణ మేధావి కాదు.. కేసీఆర్‌కి బంట్రోతు. పదేళ్లలో జర్నలిస్టుల కష్టాలు..ఇండ్లు గురించి కేసీఆర్ నీ అడిగాడా..? అల్లం నారాయణ ఓ జోకర్.. కెసిఆర్ అయ్య జాగిరా... సెక్రటేరియట్ ముందు జాగా.. ఎందుకు పెట్టొద్దు రాజీవ్ గాంధీ విగ్రహం?

పిల్లలు భావిభారత పౌరులు..వాళ్లకు అన్ని విషయాలు తెలియాలి కాబట్టి వాళ్ళ ముందు రాజీవ్ గాంధీ గురించి మాట్లాడారు. తల్లి గుండెల్లో ఉండాలి.. అందుకే తెలంగాణ తల్లి విగ్రహం సెక్రటేరియట్ లోపల పెడతున్నం మేము.. మీ అయ్య మాట్లాడితే ఇంపు.. మేము మాట్లాడితే కంపా?

# జగన్ కొంతకాలం నోరు తెరవకపోవడమే మంచిది

◆ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, మహానాడు:

వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత కూడా వైసీపీ అధినేత జగన్‌కు లేదని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు గెజిట్ నోటిఫికేషన్ రాకుండా అడ్డుకున్నది జగనేనని విమర్శించారు. గతంలో చంద్రబాబు సూచనతో ప్రకాశం జిల్లా నేతలు అందరం ఢిల్లీకి వెళ్లామని... ప్రాజెక్టు కోసం అప్పటి కేంద్ర మంత్రిని కలిశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తో జగన్ కుమ్మక్కై రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని వ్యవస్థలను ఐదేళ్ల పాటు నాశనం చేశారని విమర్శించారు. ఈ మేరకు మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు పోయి మూడేళ్లైనా దాన్ని పెట్టలేని దుస్థితిలో గత వైసీపీ ప్రభుత్వం ఉందని గొట్టిపాటి ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ



అసమర్థత వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిందని, పులిచింతల గేటు కొట్టుకుపోయిందని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన ఇసుక దోపిడీతో ప్రాజెక్టుల భద్రతకు ముప్పు వాటిల్లిందని అన్నారు. జగన్ కొంత కాలం పాటు నోరు తెరవకపోవడమే మంచిదని, లేకపోతే ప్రజలు మళ్ళీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# వైసీపీ పాలనలో అన్ని వర్గాలు అవస్థల పాలు!

◆ మంత్రి కొల్లు రవీంద్ర

కాకినాడ, మహానాడు:

వైసీపీ పాలనలో అన్ని వర్గాలు అవస్థల పాలయ్యాయని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఏలేశ్వరంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరూపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జరిగిన జీవో 217 రద్దు అభినందన సభలో మంత్రి పాల్గొని, మాట్లాడారు. మత్స్యకారుల జీవితా లను ప్రమాదంలోకి నెట్టేలా గత ప్రభుత్వం జీవో 217 తీసుకొచ్చింది.. అనాదిగా మత్స్యకారులకు ఉన్న హక్కుల్ని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నించారు..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే జీవో 217 రద్దు చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేశాం.. మత్స్యకారుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం.. త్వరలోనే మత్స్యకార సొసైటీలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.. నా వాళ్ళకు తోడుగా నిలవాలని గతంలోనే శ్రమించి యాభై ఏళ్లకే పెన్షన్ పథకానికి శ్రీకారం చుట్టాం..

జగన్ వచ్చి ఫిష్ ఆంధ్ర అన్నారు.. దాంతో ఏమైన ఉపయోగం ఉందా?

అంతర్జాతీయంగా రాష్ట్ర మత్స్య సంపదను ఎగుమతి చేసే



అవకాశాలు కల్పిస్తాం.. అక్రమ కేసులు, అరెస్టులు తప్ప జగన్ రెడ్డి ఐదేళ్లలో సాధించింది ఏమీ లేదు.. ప్రజలు బయటకు రావాలంటే కూడా భయపడే పరిస్థితి కల్పించారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గెలిచిన వెంటనే 4,000 పెన్షన్ ఇచ్చాం.. ఏప్రిల్ నుండి పెన్షన్ అమలు చేస్తూ 7,000 పెన్షన్ ఇచ్చాం.. గత ఐదేళ్లు ఉద్యోగాలు లేవు.. కానీ అధికారంలోకి రాగానే 16800 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం.. మన మత్స్యకార వర్గాల్లో వెనుకబాటుతనాన్ని నివారించేలా చర్యలు తీసుకుంటాం.. పిల్లల్ని మంచి చదువులు చదివిం చండి.. చిన్న వయసులో పెళ్ళిళ్ళు మానుకుని వారిని చదివించండి.. వారే మీ కుటుంబానికి అండగా నిలుస్తారని మంత్రి రవీంద్ర అన్నారు.

# వైసీపీ హయాంలో గిరిజనలు, దళితులు మోసపోయారు

◆ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మహానాడు:

వైసీపీ హయాంలో గిరిజనలు, దళి తులు మోసపోయారని, కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని.. దానికి ఇదే నిదర్శనమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. లబ్ధిదారులకు పట్టాదారుల పాసు పుస్తకాలు పంపిణీ కార్య క్రమంలో ఆయన పాల్గొని, మాట్లా డారు. నకరికల్లు మండలం నకరికల్లు పార్టీ కార్యాలయంలో ఎస్టీ కాలనీకి చెందిన 55 మంది గిరిజన రైతులకు వీటిని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల, గ్రామ నాయకులు జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 21, ఆగస్టు 2024




















# భూవివాదాలను త్వరగా పరిష్కరించండి

- సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశం
- 28వ రోజు మంత్రి నారా లోకేష్ 'ప్రజాదర్బార్' కు క్యూ కట్టిన ప్రజలు
- బాధితుల నుంచి వినతుల స్వీకరణ

**అమరావతి, మహానాడు:** భూవివాదాలపై ప్రజల నుంచి ఎక్కువ విజ్ఞప్తులు వస్తున్నందున ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో 28వ రోజు మంత్రి నారా లోకేష్ 'ప్రజాదర్బార్' కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను విన్నవించారు. ఆయా విజ్ఞప్తులను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణం కోసం పెదవడ్లపూడికి చెందిన 40 మంది వృద్ధులు కలిసి సేకరించిన రూ. 28 వేల విరాళాన్ని మంత్రి నారా లోకేష్ ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి అభినందనలు తెలిపారు.

## మంగళగిరి నియోజకవర్గం నుంచి విన్నపాలు

### చెరువు ఆక్రమణలు తొలగించండి

- మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన రైతులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. వైకాపా అండతో గ్రామంలోని ఉప్పలపాటి చెరువు కట్టను కొంతమంది ఆక్రమించారని, దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.
- పెద్దవడ్లపూడిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న 40 ఎకరాల రైతు పట్టా భూములను 2010లో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రికార్డులు పరిశీలించి 22-ఏ నుంచి తమ భూములు తొలగించాలని గ్రామానికి చెందిన బాధిత రైతులు కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.
- దివ్యాంగుడనైన తనకు ఎలాంటి ఆధారం లేదని, ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన షేక్ మౌలాలి విజ్ఞప్తి చేశారు.
- చిట్యాల ఐలమ్మ రజక ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ఉండవల్లి గ్రామానికి చెందిన రజక సోదరులు కోరారు.
- బీకామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దుగ్గిరాలకు చెందిన చల్లపల్లి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు

### మాజీ మంత్రి కాకాణి అండతో భూమిని కబ్జా చేశారు

నెల్లూరు జిల్లా సైదాపురం రెవెన్యూ పరిధిలో వంశపారంపర్యంగా వచ్చిన తన రెండెకరాల భూమిని మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి అండతో కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన రావిళ్ల శ్రీనివాస నాయుడు విజ్ఞప్తి చేశారు.

- పోలియో వ్యాధి బారినపడి మంచానికే పరిమితమైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఎమ్.మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు.
- పుట్టుకతో దీర్ఘకాలిక చర్మవ్యాధి బారినపడిన తమ కుమారుడికి పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మద్దిగుంట జగదీష్ చంద్రప్రసాద్ కోరారు.
- చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన యూనియన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు ఆదేశాలు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. లాక్ డౌన్ సమయంలో అధికారులు రెన్యువల్ చేయలేదని, ఇప్పుడు జిల్లా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.
- స్టీల్ ఎక్స్‌చేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం సేకరించిన తన 18 సెంట్ల స్థలానికి నష్టపరిహారం చెల్లించలేదని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన కళ్లేపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు.
- అనియత విద్య బోధక, పర్యవేక్షకులకు అర్హతను బట్టి వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యా శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో నియమించాలని నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్ వైజర్స్ అండ్ ఇన్ స్ట్రక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న బీఈడీ, రికార్డు ఫీజులు తగ్గించాలని ఎన్ఎస్ యూఐ ప్రతినిధులు కోరారు.
- పార్ట్ టైం జాబ్ ఆశచూపి నకిలీ బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.16 లక్షల వరకు సైబర్ మోసానికి పాల్పడ్డారని, విచారించి తగిన న్యాయం చేయాలని తిరుపతి జిల్లా కామకూరుకు చెందిన వి.గురేష్ విజ్ఞప్తి చేశారు.
- కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్య సాయం నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తిరిగి మంజూరు చేయాలని కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన గొల్లమందల శ్రీను కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.







జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 21, ఆగస్టు 2024

# హైడ్రా వల్ల సామాన్యులకు పాట్లు!

- బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి

హైదరాబాద్, మహానాడు:
హైడ్రా విభాగం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైడ్రా ఆలోచన బాగున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడం లేదని బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార భిక్ష పెట్టిన ప్రజలను హింసించడం సరికాదు. భూమి కొనుగోలు చేసినప్పుడు చాలా మందికి అది ఏ పరిధిలోనిది అనేది తెలియదు. హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుందా? అనుమతులు ఉన్నాయా? లోన్ వస్తుందా అనేది మాత్రమే ప్రజలు చూస్తారు. శిఖం భూమి, బఫర్ జోన్ అనే విషయాలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కష్టపడి సంపాదించి, సొంతిల్లు కొనుగోలు చేసే క్రమంలో ఆర్థిక స్థోమతను దృష్టిలో పెట్టుకుని తక్కువగా వచ్చే చోట కొనుగోలు చేస్తారు. అయితే, బఫర్ జోన్ లో కొనుగోలు చేసిన భూముల విషయంలో చాలాచోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అన్ని అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేసి సామాన్యులపై పడటం ప్రజాపాలన కాదు. హైడ్రాకు చైర్మన్ గా ముఖ్యమంత్రి, కమిషనర్ గా ఉన్న ఏవి రంగనాథ్ ఈ విషయంలో ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పాలి. రియల్టర్లకు అనుమతులు ఎవరిచ్చారు? లేఔట్ వేసేందుకు పర్మిషన్లు ఇచ్చిందెవరు? ప్రభుత్వ అనుమతులతోనే ప్రజలు



గతంలో భూములు, ప్లాట్లు కొన్నారు.

బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలియకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండానే రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయా? ప్రభుత్వానికి తెలియకుండానే ఎఫ్‌టీఎల్ ప్రకారం డాక్యుమెంట్లు ఎలా తయారయ్యాయి? అనుమతి లేకుండానే లేఔట్లు ఎలా అయ్యాయి? ఇళ్ల నిర్మాణంతో పాటు ప్లాట్లు ఎలా అమ్ముడయ్యాయి? దానికి బాధ్యులెవరు? అనుమతి ఇచ్చిన జీహెచ్ఎంసీది తప్పా? కమిషనర్లది తప్పా? అని కాటిపల్లి ప్రశ్నించారు.

# కూటమి ప్రభుత్వం సంకల్పానికి ప్రకృతీ సహకరిస్తోంది

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు
- వినుకొండ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

వినుకొండ, మహానాడు:
రాష్ట్రంలో ప్రతిచేనుకు నీరు, ప్రతిచేతికి పని అనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న కూటమి ప్రభుత్వం సంకల్పానికి ప్రకృతి కూడా సహకరిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు చంద్రబాబు వస్తే వానలు పడవన్న వైకాపా తప్పుడు ప్రచారాలకు జోరు వానలో వరుణుడే సమాధానం చెబుతున్నట్టు కనిస్తోందన్నారు. స్వల్పవ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలన్నీ



నిండుకుండల్లా మారాయని, పల్లెసీమలన్నీ పచ్చ తోరణంగా మారడం సంతోషంగా అనిపిస్తోందన్నారు.

వినుకొండ శ్రీనివాసనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామికి జీవీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారిద్దరికి వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణను ప్రారంభించి భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడారు.

కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించు



కున్నాయని, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలన్నీ పూర్తిగా నిండాయన్నారు. భగవంతుడు దయతో ఈ ఏడాది పాడి పంటలు బాగా పండి అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆ వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన యజ్ఞయాగాలు, అన్నసమారాధన, చివరిరోజు పూర్ణాహుతి కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయని ఆలయ కమిటీ నిర్వాహకులను అభినందించారు.

అనంతరం మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు... వినుకొండ పట్టణంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు జీవీ ఆంజనేయులుకు శ్రీవారి దివ్యాశీస్సులు ఉండాలన్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడి చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. జీవీ ఆంజనేయులు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా లభించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్ పాల్గొన్నారు.

# శానిటేషన్ అధికారుల తీరు ఆక్షేపణీయం

- ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మహానాడు:
పట్టణంలోని పశ్చిమ నియోజకవర్గంలో శానిటేషన్ అధికారుల తీరు ఆక్షేపణీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళా మాధవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఆమె పాల్గొని పలు సమస్యల్ని ప్రస్తావించారు. ప్రధానంగా శానిటేషన్ విషయంలో అధికారుల తీరు మీద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాను. పారిశుద్ధ్య నిర్వహణ తీరు ఎలా ఉంది అంటే శిథిలం అయిపోయిన చెత్త డబ్బాల స్థానంలో కొత్తవి కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. అసలు శానిటేషన్ విషయంలో కార్పొరేటర్లు గాని ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఒక్క దానికి కూడా సరయిన సమాధానం ఇవ్వలేకపోతున్నారంటే అధికారుల పని తీరు ఎలా ఉందో మునిసిపల్ కమిషనర్ అర్థం చేసుకోవాలన్నారు.

గుంటూరు శ్యామల నగర్‌లో శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ లీజు ముగుస్తున్న సమయంలో దానిని పొడిగించాలని కోరుతున్నాను. ఎందుకంటే ఈ స్కూల్‌లో అనేక మంది విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారు. 1965లో దీనిని నామమాత్రపు ఫీజుతో స్థాపించి నాణ్యమైన విద్యను అందిస్తూ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ చేత ప్రశంసలు అందుకున్న ఆ పాఠశాలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రత్యేక అంశంగా పరిగణించాలని కోరుతున్నాను అని మాధవి అన్నారు.



# అన్ని జిల్లాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి సవిత
- గాంధీ బునకర్ చేనేత వస్త్ర మేళా విజయవంతం
- 14 రోజుల్లో రూ.2 కోట్ల టర్నోవర్ : మంత్రి సవిత

విజయవాడ,మహానాడు
విజయవాడలో 14 రోజుల పాటు నిర్వహించిన గాంధీ బునకర్ చేనేత మేళా విజయవంతమైందని, ప్రజల నుంచి వచ్చిన స్పందన దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో మిగిలిన జిల్లాలోనూ చేనేత వస్త్ర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవిత తెలిపారు.

ఈ నెల ఏడో తేదీ నుంచి నగరంలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న గాంధీ బునకర్ జాతీయ చేనేత





వస్త్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, 14 రోజుల పాటు నిర్వహించిన చేనేత వస్త్ర మేళా విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నేతన్నలకే ఆర్థిక మేలు కలగజేయాలన్న ఉద్దేశించి ఈ ప్రదర్శన నిర్వహించామన్నారు. తమ లక్ష్యం నెరవేరిందన్నారు. 14 రోజుల పాటు రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల రూపాయల మేర అమ్మకాలు జరిగాయన్నారు. మొత్తంగా రూ.20 కోట్ల అమ్మకాలు జరగడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో చేనేత వస్త్రాల పట్ల ఆదరణ పెరిగిందన్నారు. ప్రజలంతా నేతన్నలకు అండగా ఉండాలని, వారానికి ఒకరోజు ప్రజలంతా చేనేత



వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ చేనేత మేళాను ప్రారంభించడంతో పాటు భువనమ్మ కోసం రెండు చీరలు కొనుగోలు చేయడంతో వస్త్ర ప్రదర్శనకు విపరీతమైన ప్రచారం లభించిందన్నారు. దీంతో ప్రజలు చేనేత వస్త్రాల కొనుగోలుకు ఆసక్తి చూపారన్నారు. దీనివల్ల వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయన్నారు. మరోసారి సీఎంగా చంద్రబాబు అధికారంలోకి రావడంతో చేనేత పరిశ్రమకు స్వర్ణ యుగం వచ్చిందన్నారు. 2014-19లో చేనేత రంగ అభివృద్ధికి అమలు చేసిన అన్నీ పథకాలను అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. గడిచిన 5 ఏళ్లలో రాష్ట్రంలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్య మైందన్నారు.

### ఆకట్టుకున్న చేనేత ఫ్యాషన్ షో

చేనేత వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశంతో చేనేత మరియు జౌళి శాఖాధికారులు నిర్వహించిన సంప్రదాయమైన చేనేత వస్త్రాలతో యువతీయువకుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ప్రస్తుత ట్రెండ్ అనుగుణంగా చేనేత వస్త్రాలతో రూపొందించిన ఫ్రాగ్ లు, గౌన్లతో యువతుల ఫ్యాషన్ వాక్ విశేషంగా ఆకట్టుకుంది. యువతులతో కలిసి మంత్రి సవిత ఫ్యాషన్ వాక్ పాల్గొన్నారు. దీంతో సభికులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

### అలరించిన నృత్య రూపకం

డాక్టర్ పద్మజారెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మజారెడ్డి బృంద సభ్యులను మంత్రి సవిత సత్కరించారు.

ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత, కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్ మూర్తి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు సీఈవో వీఆర్ నాయక్, జేడీ కన్నబాబు, చేనేత కార్మికులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమస్యలు పరిష్కరిస్తాం...

- బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు

విజయవాడ, మహానాడు:
ఏపీఎస్ ఆర్టీసీలో పేరుకుపోయిన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి గత అయిదేళ్ళుగా ఉందని ఆర్టీసీ యూనియన్ నేతలు బీజేపీ ఫ్లోర్ లీడర్ పెన్మత్స విష్ణుకుమార్ రాజు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వారధి కార్యక్రమంలో విష్ణుకుమార్ రాజు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలోని వివిధ హోదాలకు సంబంధించిన యూనియన్ నేతలు తమ సమస్యలు ఏకరవు పెట్టారు. ఈ టిక్కెట్ మిషన్ లు నాణ్యత లేనవి ఇస్తున్నారని, వాటికి సమస్య వస్తే డ్రైవర్ లపై అధికారులు వేధిస్తున్నారన్నారు. అదేవిధంగా నాణ్యత లేని మిషన్లు వినియోగించడం, రెంట్‌కు తీసుకు వస్తున్న మిషన్లు ఉపయోగించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్న అవుతున్నాయని రాజు దృష్టికి తీసుకువెళ్ళారు.



అదేవిధంగా కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి దయనీయమన్నారు. గ్యారెజీల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలు అనేకం ఉన్నాయని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రమణా రెడ్డి, వై శ్రీనివాస రావు విష్ణుకుమార్ రాజుకి తెలిపారు. కాగా, కార్యక్రమంలో మరికొన్ని ఫిర్యాదులు, వినతులను విష్ణుకుమార్ రాజు స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి, పార్టీ సీనియర్ నేత పైడి వేణుగోపాల్, వారధి కో ఆర్డినేటర్ కిలారు దిలీప్ పాల్గొన్నారు.

## కోల్‌కతా డాక్టర్ ఫోటోలు, వీడియోలే కాదు

# పేరును వాడొద్దు..: సుప్రీంకోర్టు స్ట్రిక్ట్ వార్నింగ్

న్యూఢిల్లీ,మహానాడు:
కోల్‌కతా ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యురాలి హత్యాచారం ఘటనపై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆమె పేరుతో పాటు ఫోటోలు, వీడియోలతో వార్తలు ప్రసారంచేయడం, సోషల్ మీడియాలో పెట్టడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే బాధితురాలికి సంబంధించిన వివరాలను, ఫోటోలు, వీడియోల ప్రసారాన్ని నిలిపివేయాలని మీడియా సంస్థలను... సోషల్ మీడియా పోస్టులను తొలగించాలని



ఆదేశించింది సుప్రీం కోర్టు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్యురాలి హత్యా చారం ఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఇవాళ(మంగళవారం) చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జెబి పర్దివాల, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే బాధితురాలి వివరాలు, ఫోటోలు,వీడియోలను ప్రసారం చేయడంపై లాయర్లు అభ్యంతరం వ్యక్తం చేసారు. దీంతో వెంటనే బాధితురాలి వివరాలను, ఫోటోలు, వీడియోలను తొలగించాలని న్యాయమూర్తులు ఆదేశించారు.

## 100 మంది కాలేజీ యువతులపై సామూహిక అత్యాచారం..

# 32 ఏళ్ల తర్వాత నిందితులకు జీవిత ఖైదు

రాజస్థాన్: 1992లో రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చిన ఈ సెక్స్ స్కాండల్ కేసు అప్పట్లో దేశం మొత్తాన్ని కుదిపేసింది.

అజ్మీర్‌లోని కాలేజీ యువతులే లక్ష్యంగా కొందరు వ్యక్తులు చేసిన అకృత్యాలు బయటికి రావడంతో ఈ సెక్స్ స్కాండల్ వెలుగులోకి వచ్చింది. 100 మందికిపైగా కాలేజీ అమ్మాయిలను సామూహిక అత్యాచారం చేసి.. వారి నగ్న ఫోటోలను వైరల్ చేశారు. ఈ క్రమంలోనే వారిని బెదిరించి.. మరికొంత మంది అమ్మాయిలను తీసుకువచ్చేలా నిందితులు బ్లాక్ మెయిల్ చేశారు. ఈ క్రమంలోనే ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నఫీస్ చిస్తీ ప్రధాన నిందితుడు అని తేల్చారు.

మొత్తం 18 మంది నిందితులు ఉండగా.. అందులో 9 మందికి ఇప్పటికే శిక్షలు ఖరారు కాగా.. ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మరో వ్యక్తి పరారీలో ఉండగా.. ఇంకొక వ్యక్తిపై ప్రత్యేక విచారణ కొనసాగుతోంది. ఇక మిగిలిన ఆరుగురు వ్యక్తులకు జీవిత ఖైదు విధిస్తూ తాజాగా ప్రత్యేక కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 100 మంది కాలేజీ యువతులపై సామూహిక అత్యాచారం చేసి.. వారిని బ్లాక్ మెయిల్ చేసిన.. అజ్మీర్ సెక్స్ స్కాండల్ బ్లాక్ మెయిల్ కేసులో రాజస్థాన్ అజ్మీర్‌లోని ప్రత్యేక కోర్టు తాజాగా తీర్పును వెలువరించింది. మరోవైపు.. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల జరిమానా విధించింది.

- శివ శంకర్ చలువాది

9

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 21, ఆగస్టు 2024



## అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ప్రీ రిలీజ్ ఈవెంట్

ఎటువంటి పాత్రలోనైనా జీవించగల విలక్షణ నటుడు రావు రమేష్. ఆయన హీరోగా రూపొందిన సినిమా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ పతాకాలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. ప్రముఖ దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో ఆగస్టు 23న థియేటర్లలో విడుదల అవుతోంది. 'మారుతి నగర్ సుబ్రమణ్యం' శుక్రవారం విడుదల కానున్న సందర్భంగా బుధవారం (ఆగస్టు 21న) హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తున్నారు. అభిమానులు, ప్రేక్షకుల సమక్షంలో భారీ ఎత్తున నిర్వహించనున్న ఆ కార్యక్రమానికి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ జీనియస్ సుకుమార్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. అల్లు అరవింద్ కుమారుడినని, అల్లు అర్జున్ తన అన్నయ్య అని భావించే యువకుడిలా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'లో రావు రమేష్ తనయుడి పాత్ర ఉంటుందని, అందులో అంకిత్ కొయ్య నటించారని దర్శకుడు లక్ష్మణ్ కార్య తెలిపారు. అల్లు అర్జున్ బ్లాక్ బస్టర్ సినిమాల్లో సన్నివేశాలను రీ క్రియేట్ చేస్తూ 'మేడం సార్ మేడం అంతే' పాటను తెరకెక్కించామని ఆయన చెప్పారు.

## దసరా బరిలో నార్నె నితిన్

మ్యాడ్, ఆయ్ లాంటి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ చిత్రాల హిట్ తో దూసుకుపోతున్నారు నార్నె నితిన్. చిత్ర పరిశ్రమలోకి ఎన్టీఆర్ బావమరిదిగా ఎంట్రీ ఇచ్చిన నార్నె నితిన్... వరుస హిట్లతో దూసుకుపోతున్నారు. ఇదే ఊపుతో ఇప్పుడు హ్యాట్రిక్‌పై కన్నేశారు. జాతీయ అవార్డు విన్నర్, "శతమానం భవతి" దర్శకులు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో తాజాగా 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు' చిత్రంలో నటిస్తున్నారు. ఆయన సరసన సంపద హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. అన్నికమర్షియల్ ఎలిమెంట్స్ తో యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకులకు ముందుకు రానుంది.

ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ... 'మా చిత్ర హీరో నార్నె నితిన్ ఇటీవల మంచి ఫీల్ గుడ్, యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మూవీస్ తో వరుస విజయాలు అందుకుంటున్నారు. వీటికి భిన్నంగా మా సినిమా వుంటుంది. పూర్తి కమర్షియల్ ఫార్మాట్ లో భారీ తారాగణంతోతెరకెక్కించారు దర్శకుడు సతీష్ వేగేశ్న.ఎన్టీఆర్ ఎంతో మెచ్చి... ఈ కథను ఎంపిక చేశారు. ఆయన అంచనాల మేరకు దర్శకుడు ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కించారు. కచ్చితంగా ఈ దసరాకి నార్నె నితిన్ ఖాతాలోఆయ్ , మ్యాడ్ తరహాలో హ్యాట్రిక్ హిట్ పడుతుందని గట్టిగా నమ్ముతున్నాం. అని అన్నారు.



## జాగ్రత్తలు అబ్బాయిలకే కాదు అమ్మాయిలకు చెప్పాలి "కావేరి"

రిషిత, ఫైజల్, షేక్ అల్లాబకాషు, ఖుషీ యాదవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "కావేరి". ఈ సినిమాను స్యాబ్ క్రియేషన్స్ బ్యానర్‌పై షేక్ అల్లాబకాషు నిర్మాతగా, రాజేష్ నెల్లూరు



దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న కావేరి సినిమా, ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. హీరోయిన్ రిషిత మాట్లాడుతూ - పేరెంట్స్ ఎప్పుడూ అమ్మాయిలకే జాగ్రత్తలన్నీ చెబుతుంటారు. ఎలా ఉండాలి, ఎలా మాట్లాడాలి, ఎక్కడికి వెళ్లాలి అనేది. ఇవే జాగ్రత్తలు అబ్బాయిలకు చెబితే అమ్మాయిల పట్ల ఇన్ని అకృత్యాలు ఈరోజు సొసైటీలో జరగవు. ఒక అమ్మాయికి ఏదైనా జరిగితే అదే తల్లిదండ్రులు ఎంతో వేదనకు గురవుతారు. మా సినిమాలో మంచి సోషల్ మెసేజ్ ఉంది. ఇలాంటి మూవీలో నటించే అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ షేక్ అల్లాబకాషు గారికి, డైరెక్టర్ రాజేష్ గారికి థ్యాంక్స్.

హీరో ఫైజల్ మాట్లాడుతూ - నన్ను నేను బిగ్ స్క్రీన్ మీద చూసుకోవడం ఎంతో హ్యాపీగా ఉంది. మాలాంటి కొత్తవాళ్లకు అవకాశాలు రావడం అదృష్టంగా భావిస్తాం. ఎంతోమంది ఫొటోస్ పట్టుకుని అవకాశాల కోసం తిరుగుతుంటారు. మా డైరెక్టర్ రాజేష్ గారికి, మాకు అలాంటి మంచి అవకాశం ఇచ్చారు. ప్రొడ్యూసర్ షేక్ అల్లాబకాషు గారికి థ్యాంక్స్ చెబుతున్నాం. కావేరి సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది.

## ప్రభాస్ డబుల్ ధమాకా...



సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా రీ రిలీజ్ అయిన మురారి సినిమా ఎంతటి సంచలన విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో మరియు ఇతర దేశాల్లో కూడా మురారి సినిమా రీ రిలీజ్ ను ఒక పండుగ మాదిరిగా జరుపుకున్నారు. మురారి రీ రిలీజ్ పండుగ తాలూకు హడావుడి ఇంకా పూర్తి అవ్వకుండానే ప్రభాస్ ఫ్యాన్స్ రీ రిలీజ్ పండుగను జరుపుకునేందుకు రెడీ అవుతున్నారు. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా అక్టోబర్ 23న డార్లింగ్ సినిమాతో పాటు ఆయన మొదటి సినిమా ఈశ్వర్ రీ రిలీజ్ కు సిద్ధం అవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు డార్లింగ్ సినిమాను మాత్రమే రీ రిలీజ్ చేయబోతున్నట్లుగా ప్రచారం జరిగింది. కానీ ప్రముఖ సినిమా పంపిణీ సంస్థ ఈశ్వర్ సినిమాను రీ రిలీజ్ చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన చేయడంతో ఫ్యాన్స్ కి డబుల్ ధమాకా అంటూ ప్రచారం మొదలయ్యింది. ఈ సమయంలో ఫ్యాన్స్ కి డబుల్ ధమాకా ఏమో కానీ, ఏ సినిమాకు వెళ్లాలో అర్థం కాక జుట్టు పీక్కునే పరిస్థితి ఉంటుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ కెరీర్‌లో మొదటి బిగ్ కమర్షియల్ హిట్ డార్లింగ్. అలాంటి సినిమాను చూడాలని ప్రభాస్ ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఉండటం చాలా సహజమైన విషయం. ఈ స్టైల్ చూశారా.. ఈశ్వర్ కూడా ప్రభాస్ కెరీర్ లో అత్యంత కీలకమైన మూవీ. ప్రభాస్ మొదటి సినిమా అవ్వడంతో పాటు, ఆ సినిమా కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కనుక ఆ రెండు సినిమాల్లో ఏది చూడాలి అనేది తేల్చుకోలేక ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలా ఒకేసారి రెండు సినిమాలను రీ రిలీజ్ చేయడంను కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఏదైనా ప్రత్యేక సందర్భం లేదా బర్త్ డే ఉంటే ఒకొక్క సినిమా చొప్పున రీ రిలీజ్ చేయాలి, అప్పుడే ఫ్యాన్స్ ఆ ఒక్క సినిమాను పండుగల ఎంజాయ్ చేస్తూ చూస్తారు.

## 'ఉత్సవం' నుంచి మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ సాంగ్

దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఇంపాక్ట్ ఫుల్ తెలుగు డ్రామా 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వం వహిస్తున్నారు. హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'ఉత్సవం' నుంచి మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ సాంగ్ ని రిలీజ్ చేశారు. స్టార్ కంపోజర్ అనూప్ రూబెన్స్ ఈ పాటని బ్యూటీఫుల్ సిగ్నేచర్ మెలోడీగా కంపోజ్ చేశారు. ట్యూన్ విన్నవెంటనే కనెక్ట్ అయ్యేలా వుంది. సాంగ్ టైటిల్ కి తగ్గటే మ్యారేజ్ వైబ్ తో ఆర్కెస్ట్రా రైజేషన్ అద్భుతంగా వుంది. అనంత శ్రీరామ్ రాసిన లిరిక్స్ ఈ పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. అర్మాన్ మాలిక్ తన వోకల్స్ తో మెస్మరైజ్ చేశాడు. ఈ సాంగ్ లో లీడ్ పెయిర్ దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా కెమిస్ట్రీ బ్యూటీఫుల్ గా వుంది. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, నాజర్, రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్.బి. శ్రీరామ్, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి, ఆమని, సుధ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్.



## దీపావళి కానుకగా అక్టోబర్ 31న "లక్కీ భాస్కర్"

వివిధ భాషలలో సినిమాలు చేస్తూ, దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ "మహానటి", "సీతారామం" వంటి ఘన విజయాలను సొంతం చేసుకున్న ఆయన, ఇప్పుడు "లక్కీ భాస్కర్" అనే మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని, ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. దుల్కర్ సల్మాన్ అభిమానులు మాత్రమే కాకుండా సినీ ప్రేమికులు సైతం "లక్కీ భాస్కర్" విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దానికి తోడు ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన "శ్రీమతి గారు" గీతం, టైటిల్ ట్రాక్ తో పాటు, టీజర్ విశేషంగా ఆకట్టుకోవడంతో ప్రేక్షకులలో సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. ఇక ఈ చిత్రాన్ని మొదట సెప్టెంబర్ 7 వ తేదీన విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే ఇప్పుడు దీపావళి పండుగ కానుకగా విడుదల చేయాలని నిర్ణయించారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రం అక్టోబర్ 31న థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు ప్రకటించారు. "లక్కీ భాస్కర్" కోసం ఇంతలా ఎదురు చూస్తున్న అభిమానులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు చెబుతూనే.. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేయడానికి అదనపు సమయం పడుతుందని, అందుకే విడుదల తేదీ మారిందని నిర్మాణ సంస్థ వివరించింది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం, డబ్బింగ్ సహా అన్ని సాంకేతిక విభాగాల



విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పని చేస్తున్నట్లు తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని, ప్రతి భాషలో మాతృ భాష అనుభూతిని అందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

## స్త్రీ 2.. కల్కి లెక్కను మించిపోయేలా..

శ్రద్ధాకపూర్, రాజ్ కుమార్ రావు పంకజ్ త్రిపాఠి లీడ్ రోల్ లో మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ నిర్మించిన హర్రర్ కామెడీ మూవీ స్త్రీ2. ఈ సినిమా ఆగష్టు 15న గ్రాండ్ గా రిలీజ్ అయ్యింది. హిందీలో అక్షయ్ కుమార్, జాన్ అబ్రహం లాంటి స్టార్ హీరోలకి పోటీగా స్త్రీ 2 చిత్రాన్ని రిలీజ్ చేశారు. అయితే మొదటి రోజే కలెక్షన్స్ పరంగా స్త్రీ 2 టాప్ లో నిలిచింది. అక్షయ్ కుమార్ ఖేల్ ఖేల్ మే, జాన్ అబ్రహం వేదా సినిమాలు కలెక్షన్స్ పరంగా స్త్రీ2 దరిదాపుల్లోకి కూడా లేవు. ఏకంగా 60ం కోట్లకి పైగా మొదటి రోజు కలెక్షన్స్ స్త్రీ మూవీ అందుకుంది. వీకెండ్ సెలవులతో పాటు ఫెస్టివల్ కూడా కలిసి రావడంతో స్త్రీ సినిమాకి కలెక్షన్స్ పరంగా అడ్డే లేకుండా పోయింది. స్త్రీ2 మూవీ నాలుగు రోజుల్లోనే 200 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని అందుకుంది. ఐదో రోజు కూడా సాలిడ్ కలెక్షన్స్ ని వరల్డ్ వైడ్ గా సాధించింది. దీంతో ఇప్పటి వరకు 242 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ ని స్త్రీ2 మూవీ సాధించింది. 50 కోట్ల బడ్జెట్ తో చిత్రాన్ని నిర్మించారు. ఈ స్టైల్ చూశారా.. ఇప్పటికే బ్రేక్ ఈవెన్ కలెక్షన్స్ అందుకొని లాభాల బాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ ఏడాది బాలీవుడ్ లో హైయెస్ట్ కలెక్షన్స్ రికార్డ్ కల్కి 2898ఏడీ పేరు మీద ఉంది. కల్కి మూవీ లాంగ్ రన్ లో హిందీలో 295 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ అందుకుంది. అయితే స్త్రీ2 మూవీ ఈ కలెక్షన్స్ ని బ్రేక్ చేయబోతోందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. వీకెండ్ తర్వాత కూడా స్త్రీ2 చిత్రానికి సాలిడ్ కలెక్షన్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో హిందీలో కల్కి లాంగ్ రన్ గ్రాస్ కలెక్షన్స్ ని స్త్రీ2 బ్రేక్ చేస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144